ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

1-12-2024 ఆదివారం సంపుటి: 30 సంచిక: 303 పేజీలు: 8+4 వెల: 8.00



అమెరికాలో కాల్పులు: ఖమ్మం విద్యార్థి మృతి

త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్: రంగనాథ్

7లో


# చర్చకు రాగలరా?



శనివారం మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌వద్ద రైతు పండుగ సభకు హాజరైన సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి



సభకు హాజరైన అశేష జనసందోహం

- మోడీ, కెసిఆర్ ఎవరొస్తారో రండి
- యేడాదిలోనే 25 లక్షల మందికి రూ. 21 వేల కోట్ల రుణమాఫీ
- దేశ చరిత్రలోనే ఇది అపూర్వం
- కాళేశ్వరం నీళ్లు రాకపోయినా 66 లక్షల ఎకరాల్లో సాగు
- కొడంగల్‌కు పారిశ్రామికవాడ తెస్తాం, 25 వేల మందికి ఉద్యోగాలిస్తాం
- అమిస్తాపూర్ రైతు పండుగ సభలో సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 30 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి ఏడాదిలోనే 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఒక్కొక్కరుగా వస్తారో, అందరూ కలిసి వస్తారో రండి.. అసెంబ్లీలో చర్చిద్దాం..రైతు రుణమాఫీ చేసిన చరిత్ర మాది.. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన చరిత్ర మాది.. రైతు బీమా తెచ్చింది కాంగ్రెస్.. వరి పంటకు రూ.500 బోనస్ ఇచ్చింది కాంగ్రెస్.. రైతు సంక్షేమం కాంగ్రెస్ పేటెంట్ ' అని తేల్చి చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ పరిధిలోని అమిస్తాపూర్ వద్ద రైతు పండుగకు ఆయన హాజరై ముందుగా స్టాళ్లను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. నవంబర్ 30, 2023కు దేశ రాజకీయాల్లోనే ఒక గొప్ప ప్రాధాన్యత ఉంది..పోలింగ్ బూత్‌లలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అండగా నిలబడి ఇవాళ్టికి సరిగ్గా ఏడాది పూర్తయింది.

రైతు బిడ్డగా కొండారెడ్డి నుంచి బయలుదేరి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఇక్కడికివచ్చా.. నాకు ముఖ్యమంత్రి పదవి ఆశామాషీగా వచ్చింది కాదు.. ఇది ఒక బాధ్యత.. బీఆరెస్, బిజెపి నాయకులు ఎలాంటి విమర్శలు చేస్తున్నారో మీరు గమనించండి..పదేళ్లలో వాళ్లు ఏం చేశారో నాకంటే మీకే ఎక్కువ తెలుసు.. వాళ్ల పదేళ్ల పాలనలో రైతు రుణమాఫీ జరిగిందా?.. రైతుకు గిట్టుబాటు ధర లభించిందా?.." అని ప్రశ్నించారు. వరి వేస్తే ఉరేఅని చెప్పిన ఆనాటి పెద్ద మనిషి కెసిఆర్.. కానీ ఈనాడు వరి ధాన్యానికి బోనస్ >>2

## నీటివాటాల పంపిణీ అయ్యేదాకా
# గోదావరి, కృష్ణ బోర్డుల జోక్యం వద్దు
## అంతర్రాష్ట్ర జలవివాదాలపై సమీక్షించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు30:** కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు వీసమెత్తు నష్టం వాటిల్లకుండా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఆదేశించారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలు, రికార్డులు, ఉత్తర్వులు సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను, న్యాయ నిపుణులను అప్రమత్తం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో శనివారంనాడు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సాగునీటి పరిస్థితి, కృష్ణా గోదావరి జలాలపైఉన్న అంతరాష్ట్ర వివాదాలు, నీటివాటాల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగాచర్చించారు. రాష్ట్రపునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల నీటివాటాలు, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులను బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయించాల్సి ఉంది. ట్రిబ్యునల్ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభిప్రాయాలను, ఆధారాలను మాత్రమే సేకరించింది. త్వరలోనే ట్రిబ్యునల్ >>2

# కాంగ్రెస్‌దీ బిఆర్ఎస్ బాటే!



శనివారం బిజెపి కార్యాలయంలో వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న మంత్రి కిషన్ రెడ్డి

## ప్రజా సమస్యలపై బిజెపి ఛార్జిషీటు
## పంచాయితీలకు నిధులివ్వని రేవంత్ ప్రభుత్వం
## బిజెపి సంఘటన్‌పర్వ్ వర్క్‌షాప్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ప్రజాసమస్యలపై ఛార్జ్ షీట్ రూపకల్పన చేసి ప్రజల ముందు పెట్టాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బిజెపి సంస్థాగత ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర కార్యాలయంలో వర్క్‌షాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు. ఈ కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు ఎంతో ఆరాటపడి, పోరాటాలుచేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం పదేండ్లు గత ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబ మయం అయ్యిందన్నారు. కుటుంబ పాలనపోవాలని, కెసిఆర్ అవినీతి పోవాలని గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే వాళ్లు సైతం బిఆర్ఎస్ పార్టీ అడుగుజాడల్లోనే నడుస్తున్నారని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో చూసిన అహంకారం, నియంతృత్వం, అవినీతి, వైఫల్యాలను కాంగ్రెస్ ప్రభుత్వంలో చూస్తున్నామని అన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఒక్కసీటు కూడా గెలిపించలేదు. చాలా నియోజకవర్గాల్లో డిపాజిట్లు కూడా రాలేదని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.


తెలంగాణ అభివృద్ధి కోసం నరేంద్రమోడి ప్రభుత్వం అండగా నిలబడుతుందని, జాతీయ రహదారులు, రైల్వేల అభివృద్ధి కోసం కేంద్రం అనేక సహకారాలు అందిస్తోందన్నారు. గ్రామపంచాయతీలకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా గ్రామ పంచాయతీలకు నిధులివ్వడం లేదన్నారు. 15వఫైనాన్స్ నిధులతోనే గ్రామపంచాయతీలకు నిధులు అందుతున్నాయన్నారు. చిన్న చిన్న అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం ప్రజలు సంతోషంగా లేరని, అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలను సంఘటితం చేసి ఉద్యమబాట పట్టాలని, ఆ దిశలో పార్టీ కార్యక్రమాలు రూపకల్పన చేయాలన్నారు. పోలింగ్ బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు కొత్త కమిటీలు రాబోతున్నాయని పేర్కొన్నారు. బిజెపి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల లాగా కుటుంబం అధారంగా నడిచే పార్టీ కాదని, ప్రజాస్వామ్యబద్ధంగా పని చేసే పార్టీ అన్నారు. బూత్ స్థాయి నుండి మంచి నాయకత్వం రావాలి, మంచి కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. ఇటీవల రాష్ట్ర ఎమ్మెల్యేలు, ఎంపిలతో ప్రధాని నరేంద్ర మోడిని కలిసినప్పుడు తెలంగాణలో బిజెపికి మంచి భవిష్యత్తు ఉందని, ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సూచించారన్నారు. కేంద్రప్రభుత్వం తరపున తెలంగాణ అభివృద్ధి కోసం, తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం అన్ని రకాలుగా అండగా నిలబడుతామని మోడీ గారు స్పష్టంగా చెప్పారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సూచించారు.

# మళ్లీ జనాలపై పెద్దపులి దాడి



## కొమురంభీం జిల్లాలో ఓ రైతుకు తీవ్ర గాయాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు30:** నెల రోజులుగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద పులులు, చిరుతపులి సంచారంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. అటవీ ప్రాంతాలను వదిలి పెద్దపులి జనావాసంలోకిరావడంతో పల్లెజనాలను కంటిమీద కునుకు లేకుండా పోతోంది. శుక్రవారం కొమురం భీం జిల్లా గన్నారం బేస్ క్యాంపు శివారులో మోర్లె లక్ష్మీ (22)ని పత్తి చేనులోనే వెంటాడి వేటాడి చంపిన పులి శనివారం ఉదయం కంది చేనుకు వెళ్లిన దుబ్బగూడా గ్రామానికి చెందిన సురేష్ (29) అనే రైతుపై హఠాత్తుగా దాడి చేసి మెడపై తీవ్రంగా గాయపరిచింది. ఇప్పటివరకు ఇదే డివిజన్లో నవంబర్ మాసంలోనే మ్యాన్ ఈటర్ నలుగురి ప్రాణాలు తీయడం కలకలంరేపుతోంది. ప్రాణహితతీరం అవతలి వైపు మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్, ఇంద్రావతి పులుల అభయారణ్యం నుంచి పెద్దపులుల వలసలు ఆదిలాబాద్ జిల్లాలో పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇటీ >>2





## పిఎస్సీ కొత్త చైర్మన్‌గా
# బుర్రా వెంకటేశం
## 3తో ముగియనున్న ప్రస్తుత చైర్మన్ పదవీకాలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు30:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్సి)కు తెలంగాణ ప్రభుత్వం కొత్త చైర్మన్‌ను నియమించింది. ప్రస్తుతం విద్యా శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశంను టిజిపిఎస్సి చైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు >>2



శనివారం భారీ వర్షాలకు చెన్నైలో మోకాలిలోతు నీటిలో రహదారులు

## ఎపి, తమిళనాడును
# వణికిస్తున్న తుఫాను
## నీటమునిగిన చెన్నై మహానగరం
## దక్షిణకోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు

**చెన్నై /విజయవాడ, నవంబరు 30:** బంగాళాఖాతంలో వాతావరణపరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. తీవ్ర వాయుగుండం తుపానుగా మారింది. పుదుచ్చేరి, తమిళనాడు తీరాలవైపు బలంగావస్తున్న ఈ ఫెయింజల్ తుపాను కొన్ని గంటల్లోతీరాన్ని తాకేఅవకాశంఉంది. దీనితో తమిళనాడు పలుజిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. రాజధాని చెన్నైలో పలు ప్రాంతాలు జల మయమయ్యాయి. వర్షాలకారణంగా విమానాశ్రయాన్ని తాత్కాలికంగామూసివేసారు. బల >>2

# 5న 'మహా' సిఎం ప్రమాణం
## అభ్యర్థిపై ఇంకా డోలాయమానం

**ముంబయి, నవంబరు 30:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై అస్పష్టత ఇప్పటికీ కొనసాగుతుండగానే మరోపక్క బిజెపి నాయకులు ప్రమాణ స్వీకారం తేదీలను ఖరారు చేసారు. ఒపక్క షిండే అలకబూని స్వస్థలానికి వెళ్లిపోతే షిండే వర్గీయులు మాత్రం ఆయన అనారోగ్యంకారణంగా స్వస్థలంలో విశ్రాంతి తీసుకుంటున్నా రంటూ నమ్మబలుకుతున్నారు. మొత్తంగా చూస్తే అత్యధిక మెజార్టీతో గెలిచినప్పటికీ కాలపరిమితి తీరిపోయి వారం గడుస్తున్నా మహారాష్ట్రలో >>2

## ప్రభాకర్ రావు, శ్రవణ్‌ల
# పాస్‌పోర్టుల రద్దు
## ఫోన్ ట్యాపింగ్ కేసు మరో మలుపు

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు మరో కీలక నిందితుడు శ్రవణ్ రావుల పాస్‌పోర్టులను కేంద్రం రద్దు చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ శనివారం నాడు ప్ర భాకర్ రావు, శవణ్‌రావుల న్యాయవాదులకు దీనికి సంబంధించి సమాచారం అందజేసింది. అయితే పభాకర్ రావు, శవణ్‌రావుల పాస్‌పోర్టులను సస్పెండ్ చేయడాన్ని తప్పుబడుతూ వారితరపు న్యాయవాదులు కేంద్ర హోం శాఖకు పిటిషన్ >>2

## యేడాది క్రితం సరిగ్గా ఇదే రోజు..

### సిఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 30:** సరిగ్గా యేడాది కింద మార్పు కోసం కాంగ్రెస్‌పై విశ్వాసంతో అధికారాన్ని కట్టబెట్టిన అన్న దాతలతో కలిసి రైతు పండుగ చేసుకోవడానికి ఉమ్మడి పాలమూరుకు వస్తున్నట్లు సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రైతన్న బాగు కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న వివరాలను ఎక్స్ వేదికగా శనివారం వెల్లడించారు. సంవత్సరం కిందట సరిగ్గా ఇదేరోజు పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు, పోలింగ్‌బూతుకు వెళ్లి మార్పు కోసం ఓటేశారని గుర్తు చేశారు. ఆ ఓటు అభయహస్తమై రైతన్న చరిత్రను తిరగరాసిందని వివరించారు. రైతును రాజుగా మార్చేందుకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలుచేస్తున్నట్లు సిఎం పేర్కొన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ, రూ.7,625 కోట్ల రైతు భరోసా, ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్.. రూ. 10,444 కోట్ల ఉచిత విద్యుత్, రూ.1,433 కోట్లు, రైతు బీమా చెల్లించినట్లు వివరించారు. రూ.95 కోట్ల పరిహారం, రూ.10,547 కోట్ల ధాన్యం కొనుగోళ్లకు మొత్తం కలిపి ఒక్క యేడాదిలో రూ.54 వేల కోట్లు ఖర్చుచేసి, రైతుల జీవితాల్లో పండుగ తెచ్చామని పేర్కొన్నారు. ఇది సంఖ్య కోసం చెబుతున్నది కాదని, రైతులు తమపై పెట్టుకున్న నమ్మకమని వివరించారు. రైతుల సంతోషంలో పాలుపంచుకోవడం కోసం ఉమ్మడి పాలమూరు సభలో పాల్గొంటానని మహబూబ్‌నగర్ పర్యటనకు వెళ్లే ముందు సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు.

## రాజకీయాలకు బ్రేక్..

### వైరల్ అవుతున్న కెటిఆర్ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 30:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికరంగా రాజకీయాలకు బ్రేక్ ఇచ్చారు. అయితే, పూర్తిగా బ్రేక్ కాదులెండి.. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు. తాను రిఫ్రెష్ అవ్వాలనుకుంటున్నానని, అందుకే కొన్నిరోజులపాటు ఈ రాజకీయ కార్యక్రమాలన్నింటికీ దూరంగా ఉండాలనుకుంటున్నట్లు కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, తాను పాలిటిక్స్‌లో యాక్టివ్‌గా లేను కదా అని తన రాజకీయ ప్రత్యర్థులు తనను ఎక్కువగా మిస్సవ్వరని అనుకుంటున్నానంటూ కేటీఆర్ చమత్కరించారు. ఈ ట్వీట్‌కు ఓ స్మయిలింగ్ ఎమోజీని కూడా జోడించారు. ప్రస్తుతం కేటీఆర్ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు తమదైనశైలిలో స్పందిస్తున్నాయి. కాగా ప్రస్తుతం కెటిఆర్ ట్వీట్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నది. ఆయన ఈ ట్వీట్‌ను ఎందుకు చేశారు. ఆయన ఏమైనా విదేశాలకు వెళుతున్నారా అంటూ ఆరా తీస్తున్నారు.

## ప్రైవేటు బస్సు ప్రమాదం

### నలుగురు మృతి, 21 మందికి తీవ్రగాయాలు



**ఖర్గోన్, నవంబరు 30:** రాష్ట్రంలోని ఖర్గోన్‌నుంచి ఆలిరాజ్‌పూర్ వెళుతున్న ప్రైవేటు బస్సు ప్రమాదానికి లోనుకావడంతో నలుగురు చనిపోయారు. మరో 21 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు వేగంగా వెళుతున్న సమయంలో డ్రైవర్ అదుపు తప్పింది. జిరాత్‌పురా క్రాసింగ్‌వద్ద చక్రాలపై డ్రైవర్‌కు అదుపుతప్పిందని దీనితో ప్రైవేటు బస్సు ప్రమాదానికి లోనయినట్లు పోలీసులు తెలిపారు. 21మంది తీవ్ర గాయాలయ్యాయని వారిలో ఎనిమిది మందిని జిల్లా కేంద్రానికి పంపించినట్లు జిల్లా ఎస్‌పి ధర్మరాజ్ మీనా తెలిపారు. తిరగబడిన బస్సును జెసిబి సాయంతో సాధారణ స్థితికి తెచ్చామని స్పాట్‌నుంచి డ్రైవర్ పరారయ్యాడనిచ ఎపుతున్నారు. బస్సు కండక్టర్‌నున పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రమాదానికి గల కారణాలను విచారిస్తున్నారు.

## పుష్ప-2 సినిమా టికెట్ల ధర భారీగా పెంపు

### తెలంగాణ సర్కార్ అనుమతి


**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో తెరకెక్కిన పుష్ప2 సినిమా టికెట్ ధరలను భారీ పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు దీనికి సంబంధించి శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో టికెట్ల రేట్ల పెంపునకు అంగీకారం తెలిపింది. రాత్రి 9.30 గంటల షోకు, అర్ధరాత్రి 1 గంట షోకూ టికెట్ ధరను అదనంగా 800 రూపాయలకు పెంచింది. ఈ షో చూడాలంటే రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్‌లో ఎక్కడైనా సరే ప్రస్తుతం ఉన్న ధరకు అదనంగా 800 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఈ పెంపుతో కలుపుకొని సింగిల్ స్క్రీన్‌లో టికెట్ ధర 1,000 రూపాయలు అవుతుంటే, మల్టీప్లెక్స్‌లో 1200 రూపాయలకు పైగా రేటు ఉంటుంది. ఇక డిసెంబర్ 5 నుంచి 8 వరకు సింగిల్ స్క్రీన్‌లలో 150 రూపాయలు, మల్టీప్లెక్స్‌లో 200 రూపాయల చొప్పున పెంపునకు అనుమతి ఇచ్చింది. అలాగే డిసెంబర్ 9 నుంచి 16 వరకు సింగిల్ స్క్రీన్‌లలో 105 రూపాయలు, మల్టీప్లెక్స్‌లో 150 రూపాయల చొప్పున పెంపునకు అంగీకారం తెలిపింది. ఇక డిసెంబర్ 17 నుంచి 23 వరకు సింగిల్ స్క్రీన్‌లలో 20 రూపాయలు, మల్టీప్లెక్స్‌లో 50 రూపాయలు పెంచుకునేందుకు తెలంగాణ సర్కార్ అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. టికెట్ పెంపుదలతో పాటు, డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటలకు, అర్ధరాత్రి ఒంటి గంటకు బెనిఫిట్ షోలకు కూడా సర్కారు ఒకే చెప్పింది.

### హీరో అల్లు అర్జున్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్‌పై ఓ వ్యక్తి జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అల్లు అర్జున్ తన అభిమాన సంఘానికి అర్జున్ ఆర్మీ అని పేరు పెట్టుకున్నాడని ఆరో పించారు. ఆర్మీ అనే పదం దేశానికి సేవచేసే గౌరవప్రదమైన పేరని, దీనిని అభిమాన సంఘానికి పెట్టుకోవడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ గ్రీన్ పీస్ ఎన్వి రాన్‌మెంట్ అండ్ వాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు బైరి శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు చేశారు.

## పాదయాత్రలో కేజ్రీవాల్‌పై దాడి

### అడ్డుకున్న భద్రతా సిబ్బంది



**న్యూఢిల్లీ, నవంబరు 30:** ఆమ్ ఆద్మీపార్టీ జాతీయ కన్వీనర్ ఢిల్లీ మాజీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీ వాల్‌పై యాసిడ్‌దాడికి దుండగులు ప్రయత్నించారు. శనివారం ఢిల్లీలోని గ్రేటర్ కైలాష్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి ఆయ నపై యాసిడ్ చల్లేందుకు ప్రయత్నించగా ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. ఇందుకు సంబంధించిన విడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. గ్రేటర్‌కైలాస్‌ప్రాంతంలోనే పాదయాత్రలో కేజ్రీవాల్‌పై సీసాలోని లిక్విడ్‌ను పోసేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించారు. దాంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి అడ్డుకున్నారు. పాదయాత్రలో అరవింద్ కేజ్రీవాల్ మద్దతుదారులమధ్య నడుచుకుంటూ వస్తున్నారు. ఒక్కసారిగా గుంపులోంచి వచ్చిన వ్యక్తి సీసాను తీసి అందులో ఉన్న ద్రవాన్ని ఢిల్లీమాజీసీఎంపై పోసేందుకుప్రయత్నించాడు. కేజ్రీవాల్‌తోపాటు అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వేగంగా స్పందించి ఆ వ్యక్తిని అడ్డుకున్నారు. అయితే సీసాలో కేవలం నీరుమాత్రమే ఉందని ప్రమాదకరమైన లిక్విడ్స్ ఏమీలేవని తెలుస్తున్నది. సదరు వ్యక్తిని అశోక్‌ఝాగా గుర్తించారు. ఆవ్యక్తి అలాచేయడానికి కారణాలు తెలియరాలేదు.

## ఫార్మాసిటీకి అనుబంధంగానే ఫోర్త్‌సిటీ నిర్మాణం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

### రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి దుద్దిళ్ల, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



శనివారం రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తదితరులు

**కందుకూరు, నవంబరు 30, ప్రభాతవార్త:** అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని ఐటి పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నేదురూరు నుండి మద్దెలకుంట తాండ, జైత్వారం, గఫూర్‌నగర్ గ్రామాల మధ్య రూ 17 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డితో కలిసి నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవరోధాలు సృష్టించినా అసత్య ప్రచారాలు చేసినా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వెను కడుగువేయదని పేర్కొన్నారు. అభివృద్ధి జరగా లంటే పరిశ్రమలు రావాలని పరిశ్రమలు రావాలంటే రోడ్లు మౌలిక సదుపాయాలు అవసరం ఉంటుందని అవి జరగాలంటే భూసేకరణ జరగాలని గతంలోను ఇలాంటివి జరిగాయని పేర్కొన్నారు. ఫార్మాసిటీలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి యాజమాన్యాలు ముందుకు వస్తున్నాయని వారికి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నదన్నారు. దానికోసం నివాస ప్రాంగణాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. అందుకే ఈ ప్రాంతంలో నూతన నగరం ఫోర్త్‌సిటి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశ్రమలలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి నైపుణ్యం అందించడానికి ఈ ప్రాంతంలోనే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రజలు బాగస్వాములు కావాలని కోరారు. అభివృద్ధిని చూసి విపక్షాలు జీర్ణించుకోలేక ప్రజలను తప్పుతోవ పట్టించేలా అసత్య ప్రచారాలు చేస్తుందని వారి ఉచ్చులో పడకుండా భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అర్బన్‌ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, నాయకులు బోక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, శమంతా ప్రభాకర్‌రెడ్డి, అందుగుల సత్యనారాయణ, వెంకట్‌రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, అఫజల్, కృష్ణానాయక్, పాండురంగాంరెడ్డి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వరి విత్తనాలు హోం డెలివరీ

### రవాణా చార్జీలు లేకుండా సరఫరా

### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కీలక నిర్ణయం

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త :** ప్రస్తుత యాసంగి సీజను నుండి ఫోన్ చేస్తే చాలు రైతుల ఇంటికే వరి విత్తనాలు పంపించే వినూత్న సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విధంగా ఈ యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా 2.5 లక్షల ఎకరాలకు సరిపడా 50 వేల క్వింటాళ్ల నాణ్యమైన వరి విత్తనాలు సరఫరా చేయాలనే లక్ష్యం పెట్టుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం రకరకాల మార్గాల ద్వారా రైతులకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఎలాంటి రవాణా చార్జీలు లేకుండా, రైతుల ఇంటివద్దకే విత్తనాలు పంపించాలని నిర్ణయించింది. యాసంగి పంటకాలంలో రైతుల నుంచి గిరాకీ ఎక్కువగా ఉన్న తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), కూనారం సన్నాలు (కేఎన్ఎం 163), జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 27356)తోపాటు.. దొడ్డు రకాలైన కేఎన్ఎం 118, జేజీఎల్ 4423, ఎంటీయూ 1010, ఆర్ఎన్ఆర్ 29325.. ఇలా ఏడు రకాల వరి విత్తనాలను సరఫరా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో 10 కిలోల విత్తన బస్తా రూ.900 ఉండగా, విత్తనాభివృద్ధి సంస్థ 15 కిలోల బస్తాకు రూ.700, 25 కిలోల బస్తాకు రూ.995 చొప్పున ధర నిర్ణయించింది. ప్రైవేటు విత్తన వ్యాపారులతో పోలిస్తే తక్కువ ధరకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## పవిత్రత మంటగలుస్తున్నా.. పట్టించుకోరా?

### కొండపైకి.. అన్యమత వాహనాలు - ఫ్రాంక్ వీడియోలు



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ప్రపంచప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ పవిత్రత మంటగలుస్తున్నా తిరుమల తిరుపతిదేవస్థానం విజిలెన్స్ సెక్యూరిటీ విభాగం,పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇటీవల కాలంలో అన్యమత లోగోలతో, స్టిక్కర్లతో ఉన్న వాహనాలు ఏకంగా కొండపైకి చేరుకుని కాటేజీల వద్ద పార్కింగ్ చేయడం, ఆలయం ముందువరకు రావడం పరిపాటిగా మారింది. పదిరోజుల క్రిందట ఏకంగా పాపవినాశనం ప్రాంతంలో ముగ్గురు షికారీలు ఏకంగా అన్యమతానికి చెందిన దేవుని ప్రార్థనలు పాడి వీడియోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేయడం సంచలనం రేకెత్తించింది, తాజాగా మూడురోజుల క్రిందట వైసిపి నేత ఏకంగా ఆలయం ముందు టిటిడి నిబంధనలకు విరుద్ధంగా పవిత్రత దెబ్బతీసేలా నలుగురు ఫోటోగ్రాఫర్లతో ఫోటోషూట్‌కు దిగడం మరో విమర్శలకు కారణమైంది. అదేగాక ఇద్దరు ప్రముఖులు నడకదారిలో ఫ్రాంక్ వీడియోలు తీసి పోస్టుచేయడం సంచలనం కలిగించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నా టిటిడి మాత్రం నామమాత్రంగా స్పందించడం పరిపాటిగా మారింది. ఇలాంటి చట్టవ్యతిరేక, ఆలయ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలు భక్తుల నుండి వినిపిస్తోంది. తిరుమల ఆలయ పవిత్రతను, పుణ్యక్షేత్ర ప్రాధాన్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి హిందూ భక్తునిపై, టిటిడి అధికారులపై ఉంది. పవిత్రమైన తిరుమలలో కొందరు పిచ్చిపిచ్చి వేషాలు, అల్లరిచేష్టలు చేస్తూన్నా విజిలెన్స్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. తిరుమల అంటేనే భక్తులకు అలజడిగా మారింది. కలియుగవైకుంఠంగా భాసిల్లుతున్న తిరుమలలో కొందరు సామాజిక మాధ్యమాల పిచ్చితో ఏదేదో చేష్టలు చేస్తుండటం భద్రత చర్యలను వెక్కిరిస్తున్నాయి. గతంలో భక్తుల మనోభావాలతో తమిళయూట్యూబర్స్ ఫ్రాంక్ చేయడం, ఇటీవల షికారీలు, బిగ్‌బాస్ ఫేమ్ నటులు భక్తుల విశ్వాసాలతో ఆడుకున్నారు. కొండపై అత్యంత భక్తిప్రపత్తులతో వ్యవహరించాల్సి ఉండగా భక్తిని పక్కకు నెట్టేసి ఇష్టానురీతిలో వ్యవహరిస్తున్నారు. తిరుమల ఆలయ పవిత్రత, భద్రత దృష్ట్యా ప్రత్యేకంగా ముఖ్యభద్రతనిఘా విభాగం ఏర్పాటుచేసుకున్నారు. ఐపిఎస్ హోదా ఎస్పీస్థాయి అధికారి ఇక్కడ సివిఎస్‌ఒగా కీలకంగా ఉంటారు. ఆయన క్రింద డిఎస్పీ హోదాలో విఎస్‌ఒలు, ఏవిఎస్‌ఒలు, విఐలు ఇలా మందీమార్బలం లెక్కకు మించి ఉంటూ సెక్టార్ల వారీగా పర్యవేక్షణ చేస్తుంటారు. అయితే ఇవన్నీ కూడా విజిలెన్స్ విభాగం పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. విజిలెన్స్‌విభాగం నుండి ఫిర్యాదు లేనిదే ఆలయానికి సంబంధించి, ఆలయం పరిసరాలకు సంబంధించి తిరుమల పోలీసులు ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. శాంతిభద్రతల పరిరక్షణలో, భక్తుల భద్రతలో పోలీసులు కీలకం. అలాంటిది విజిలెన్స్ పర్యవేక్షణ ఉండటంతో పోలీసులు చేతులుముడుచుకుని ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్న, పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు వెనువెంటనే తీసుకుంటే తప్ప ఇలాంటి వారి ఆగడాలకు అడ్డుకట్టపడదనేది భక్తుల అభిప్రాయం.

## దేవుని చెంత రాజకీయ ప్రసంగాలు నిషేధం

### దైవదర్శనానికి వచ్చి రాజకీయాలు మాట్లాడితే కేసులే

**తిరుమల,నవంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠంగా విరాజిల్లుతున్న తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రతను, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలతిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంది. దేవుని దర్శనానికి వచ్చి ప్రముఖులు ఎవరైనా రాజకీయ,ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తే కేసులు నమోదుకు వెనుకాడబోరనేది స్పష్టం చేశారు. నిత్యం గోవిందనామస్మరణలతో అలరారుతున్న తిరుమలకొండపై ఆలయం ముందు ఎక్కడైనా రాజకీయ నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు, ఉచిత ప్రచారం కోసం మీడియాతో రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారింది. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా పరిగణిస్తూ గోవింద నామం తప్ప మరేలాంటి పదం వినిపించ కూడదని ఆదేశించారు. గతనెల 18న కొలువుదీరిన టిటిడి నూతన ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తొలి సమావేశంలోనే కొండపై రాజకీయ వ్యాఖ్యలు నిషేధించారు. దీన్ని ఇప్పుడు డిసెంబర్ 1నుండి అమలు చేసేందుకు టిటిడి అధికారులు సిద్ధమయ్యారు. తిరుమలకు వస్తున్న రాజకీయనేతలు, ప్రముఖులు ఎవరూ కూడా దేవుని స్మరణ తప్ప రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని టిటిడి విజ్ఞప్తి చేసింది. అంతేగాక నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఆపదమొక్కుల వాడు... వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వచ్చి తమ కోర్కెలు చెప్పుకుని,కష్టాలు తీర్చమని సామాన్య భక్తుల నుండి వివిఐపిలు వేడుకోవడం పరిపాటి.

## 4న పెద్దపల్లిలో ముఖ్యమంత్రి సభ

### ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం

### నిర్వహించిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 4వ తేదీన పెద్దపల్లిలో నిర్వహించే యువ శక్తి సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సభలో దాదాపు 9000 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందచేస్తారని మంత్రి తెలిపారు. పెద్ద పల్లిలో డిసెంబర్ 4వ తేదీన తలపెట్టిన ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లపై శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్త, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శ్రీధర్, సందీప్ సుల్తానియా, క్రిస్టినా చోంగ్తు, ఫైర్ సర్వీసుల డిజి నాగిరెడ్డి, అడిషనల్ డిజి మహేష్ భగవత్, సి.ఎంఒ అధికారి వేముల శ్రీనివాసులు, సమాచార శాఖ ప్రత్యేక కమీషనర్ హరీష్, విద్యా శాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, పెద్దపల్లి కలెక్టర్ హర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో యువతకై ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ సభలో ఇటీవల గ్రూప్ 4లో లో ఎంపికైన 8143 మందికి, 442 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందచేస్తారని వివరించారు.

ఈ సభలోనే స్కిల్ యూనివర్సిటీలో బాగస్వామ్యమయ్యే ఏడు ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలను సంతకం చేయడం జరుగుతుందని,, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ప్రారంభోత్సవం, సి.ఎం కప్ ప్రారంభంలతో పాటు వందలాది కోట్ల రూపాయల విలువైన అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను తెలియచేసే దాదాపు 40 స్టాళ్లను ఈ సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే, వరంగల్, మహబూబ్ నగర్‌లో మాదిరిగానే పెద్దపల్లి సభకు విస్తృత ఏర్పాట్లను చేయాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

### ఐఆర్‌పై ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య హర్షం

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ రంగ ఉద్యోగులకు ఐఆర్ విడుదల చేయడంపై ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి జీవన్ హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వలె కాకుండా ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు మధ్యంతర భృతి విడుదల చేయడంపై ధన్యవాదాలు తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, TGEWIDC
సంక్షేమ భవన్ కార్యాలయ కాంప్లెక్స్, మిర్యాలగూడ రోడ్, నల్గొండ
STN-టెండర్ ప్రకటన నెం. 3/EE/TGEWIDC/NLG/TW/SCDD/ NIT Nos 19 to 34/2024-25 తేదీ: 28.11.2024
అర్హులైన అందరు కాంట్రాక్టరుల నుండి 16నం.లకు సూర్యాపేట జిల్లా 14లో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికలు/బాలుర వసతి గృహాలకు మైనర్ మరమ్మతులు (అంచనా ధర రూ.2.39 నుండి 6.90 లక్షలు) 15) ప్రభుత్వ SCDD కాలేజీ బాలికల వసతి గృహం (పాత) సూర్యాపేట (గ్రా & మం)కు మైనర్ మరమ్మతులు (8.00 లక్షలు) 16) యాదాద్రి భువనగిరి జిల్లాలో KGBV నారాయణపూర్ (గ్రా&మం) వద్ద భోజనాలకు ఓపెన్ షెడ్ ఏర్పాటు స్టడీ మరియు కంప్యూటర్ గది (3వ పిలుపు) అంచనా ధర 6.80 లక్షలు. 1. బిడ్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ ప్రారంభం నుండి: 30.11.2024 సా.5.00గం.వరకు. తర్వాత. 2. ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు మరియు స్వీకరణకు చివరి తేదీ: 9.12.2024 సా.4.00గం. గమనిక: Go.Ms.No.59, I&CAD తేదీ: 21.05.2018 ప్రకారం, నిట్ నం.21, 28, 32, 33 & 34లు, SC/ST/వడ్డెర/సగరలకు రిజర్వ్. పూర్తి వివరాలను https://tender.telangana.gov.in వద్ద వీక్షించవచ్చును. లేదా పై పని రోజులలో కార్యాలయ పని వేళలలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, TGEWIDC, నల్గొండ వారి కార్యాలయం వద్ద స్వయంగా సంప్రదించవచ్చును. సంప్రదించవలసిన ఫోన్ నం. 8008102825.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, TGEWIDC, నల్గొండ.
DIPR.NO. 7289-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 30.11.2024



BAJAJ FINSERV

బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్‌జ్యూవెలరీ "యథాతథంగా మరియు ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యూవెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు & షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/- ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్ ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత (లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యువెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీ పై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(12-12-24) గజ్వేల్ - పిడ్చేడ్; PEJ6SGL9191295, 9228050, 9467592. హుస్నాబాద్ - అక్కన్నపేట చౌరస్తా; PCW5SGL9193357, 9317722, 9481890, 9506921. కొత్తగూడెం - మధుర బస్తీ; PEJ5SGL9177868, 9189459, 9317223, 9362562, 9387968, 9430895, 9475767. మంచిర్యాల - హైదరాబాద్ రోడ్; PCW9SGL9205727, 9255920, 9252479, 9280658, 9321246, 9360876, 9394193, 9406366, 9500356, 9495967. నల్గొండ; P558SGL9218843, 9254777, 9322655, 9350710, 9421992, 9421634, 9470067, 9488232, 9507647. వనపర్తి - రాజీవ్ చౌక్; PCX9SGL9180565, 9242555, 9348665, 9370637. వరంగల్ - సుబేదారి; PB55SGL9307018, 9304989, 9306494, 9484156. (13-12-24) భద్రాచలం - ఆర్‌టీసి బస్ స్టాండ్; PEK5SGL9192368, 9225651, 9226526, 9245355, 9278000, 9320004, 9337589, 9347391, 9417342, 9418494, 9442628, 9444522, 9442354, 9494290. ఖమ్మం - గాంధీ చౌక్; PB54SGL8198989, 9254138, 9257787, 9330274, 9328609, 9342797, 9387951, 9417304, 9473806, 9475810. మెదక్ - టీఐ బ్రాహ్మణ్ స్ట్రీట్; PCX2SGL9193781, 9254270, 9336374, 9467916, 9508185. సంగారెడ్డి; P4D3SGL9292861, 9325274, 9348009, 9441943, 9482212, 9511114, 9513980. సిరిసిల్ల - మెయిన్ రోడ్; PB66SGL9256198, 9289088, 9325382, 9357636, 9389769, 9406799, 9419380, 9446976. (14-12-24) ఆర్మూర్-అంబేద్కర్ చౌరస్తా; PB56SGL9278453, 9281853, 9316603, 9370947, 9428962, 9458656, 9511396. చౌటుప్పల్ - మార్కెట్ ఏరియా; PCW3SGL9293586, 9304370, 9468603. గద్వాల్ - రాజీవ్ మార్గ్; PCW4SGL8865750, 8888546, 9035341, 9265377, 9266313, 9303943, 9373142, 9414214, 9499411, 9513588. ఇబ్రహీంపట్నం; P19WSGL9193662, 9207488. జనగాం - బాలాజీ నగర్; PCW7SGL9189547. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్; PGM7SGL9183614, 9190417, 9205137, 9266909, 9346021, 9370800, 9406513, 9415872. నర్సంపేట - జై శ్రీ థియేటర్; PCX3SGL9190877, 9472067. (16-12-24) ఆదిలాబాద్ - ద్వారకా నగర్; PEK4SGL9178877, 9331551, 9435179, 9476513. భువనగిరి - హైదరాబాద్ రోడ్; PCW1SGL9179715, 9225819, 9256738. జగిత్యాల-ధర్మపురి రోడ్; PCW6SGL9306384, 9496118. కోరుట్ల; PV44SGL9418020, 9509766. సత్తుపల్లి - సూపర్ మార్కెట్; PCX8SGL9244144, 9373317, 9385604, 9407815, 9402689, 9494389, 9511094. (17-12-24) బాన్సువాడ - బస్ స్టాండ్; PCV9SGL9202247, 9335288, 9346892, 9392134, 9474472, 9473416. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL9243133, 9239987, 9269356, 9283327, 9291920, 9328855, 9371012, 9394679, 9440780, 9486940, 9497548. మణుగూరు - అశోక్ నగర్; PCX1SGL9247292, 9265938, 9277328, 9415733, 9471584, 9485763. (18-12-24) కరీంనగర్ - సివిఆర్ఎస్ రోడ్; PCW8SGL9195460, 9191841, 9331163, 9416701, 9436077, 9471950. ఖమ్మం - జమ్మిబండ రోడ్; P546SGL6155840, 8972951, 9193010, 9191356, 9200751, 9256105, 9279162, 9299812, 9400924, 9403273. మిర్యాలగూడ; P7B7SGL8915129, 9246387, 9257818, 9255904, 9278175, 9292326, 9290232, 9299441, 9334710, 9445953, 9472889, 9484109. నాగర్‌కర్నూల్; P21DSGL9178894, 9202163, 9227732, 9225960, 9334775, 9343256, 9422421, 9421686. నిజామాబాద్ - కపిల హోటల్ రోడ్; PB94SGL9179317, 9332935, 9476908. సదాశివపేట - రాచయ్య నగర్; PCX6SGL9182184, 9428505, 9456876, 9453226, 9510585, 9507351. సిద్దిపేట - మెదక్ రోడ్; PGM8SGL9219100, 9239991, 9346991, 9375716, 9402131, 9406687, 9498190. (19-12-24) భోదన్ - నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL9217860, 9374993, 9402951, 9430764, 9428984, 9432094, 9442456, 9445980, 9509722. పెద్దపల్లి-సుభాష్ నగర్; PE03SGL9247291, 9240789, 9404455, 9419859, 9484001. సహదేవనగర్ - వెంకటేశ్వర కాలోనీ; PCX7SGL9215026, 9445865, 9484051, 9487308. శంషాబాద్; PY30SGL9195040. తాండూరు - ఇందిరా చౌక్; PDA6SGL9182465, 9191386, 9188628, 9256050, 9252776, 9389364, 9501228, 9513338. వరంగల్ - కేయూ క్రాస్ రోడ్; PGP7SGL9192913, 9225002, 9228744, 9292567, 9293262, 9303060, 9320688, 9350394, 9385501, 9416635, 9417437, 9428113, 9458606, 9458354. (20-12-24) భూపాలపల్లి - మెయిన్ రోడ్; PCW2SGL9183166, 9181050, 9282545, 9294019, 9316850, 9332133, 9390994, 9400188, 9474316, 9469629. కామారెడ్డి - నిజాంసాగర్ రోడ్; P86QSGL9178470, 9180892, 9191827, 9203009, 9215320, 9229800, 9244941, 9259686, 9279547, 9289241, 9292404, 9305093, 9316961, 9324411, 9331942, 9363635, 9360618, 9370996, 9387626, 9405181, 9405386, 9405960, 9433192, 9442644, 9443146, 9448107, 9474898, 9471897, 9476120, 9472798, 9469441, 9469014, 9470268, 9471031, 9486808, 9482594, 9512080. నిజామాబాద్ - వినాయక్ నగర్; PCX5SGL9316934, 9400526, 9473328, 9482764, 9497680. పటాన్‌చెరు; PY29SGL8739795, 9311427. వరంగల్ - స్టేషన్ రోడ్; P04ISGL9282806. ఇల్లందు - బుగ్గవాగు; PGC4SGL9179386, 9203245, 9302375, 9402805, 9415330, 9432508, 9429985, 9445987, 9512974, 9507411. జాహిరాబాద్ - ఆర్‌టీసీ బస్ స్టాండ్; PER4SGL9092587, 9202151, 9316369, 9358870.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

అందరికీ అన్నం పెట్టి కడుపు నింపి ఆకలి తీర్చే అన్నదాతలకు అదే ధాన్యం కన్నీళ్లు తెప్పిస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటచేతికి వచ్చికళ్ల ముందు రెక్కల కష్టం కన్పిస్తున్నా వాటిని కొనుగోలు చేసే దారిలేక రైతుల ఆశలన్నీ ఆవిరి అవుతున్నాయి. తెలంగాణలో వరికోతలు ప్రారంభమై నెలరోజులు కావొస్తున్నాయి.కానీ నేటికీ చాలా చోట్ల వడ్లకొనుగోళ్లు రైతులకు కష్టాలను తెచ్చి పెడుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో రైతులు వడ్ల కుప్పలు పోసి రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు.వడ్లకుప్పలతో కొనుగోలు కేంద్రాలన్నీ నిండిపోయాయి.స్థలంలేక వడ్లను తీసుకొచ్చిన రైతులు రోడ్లపై రాశులుగా పోస్తున్నారు. పంట ఉత్పత్తితోబాటుగా, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలభ్యం అయ్యేలా చూడాల్సిన బాధ్యతసైతం ప్రభుత్వాలపైఉంది. ప్రభుత్వం వేస్తున్న సాగు అంచనాకు, వాస్తవ సాగుకు భారీ తేడా ఉండడంతో వరి ధాన్యం కుప్పలు తెప్పలుగా మార్కెట్‌ను ముంచెతుతున్న పరిస్థితి ఉంది. దీంతో కనీస మద్దతు ధరలను రైతులకు ఇవ్వకపోవడం, ఈ నెపాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరునెట్టుకుంటూ వాస్తవ పరిస్థితిని గందరోగళంగా మార్చుతున్నాయి. ఈనేపథ్యంలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు ఒక ప్రహసనంగా తయారైంది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రోజుల తరబడిగడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో వాటికి రాత్రిపగలు రైతులు కాపలా కాయాల్సి వస్తోంది. మరోపక్క యాసంగి పనులు చేసుకోలేక, భార్యాబిడ్డలతో గడపలేక కొనుగోలు కేంద్రాల వద్దే చలిలో కాలం గడపాల్సిన దుస్థితి ఎదురవుతోంది. అసలే కష్టాల్లో ఉన్న రైతులను మరోపక్క తరుగుపేరుతో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు మరింత నష్టాల పాల్చేస్తున్నారు. అంతేకాకుండా తేమ పేరుతో సాకులు చూపి మద్దతుధరలు ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణలో వానాకాలం వరి కోతలు జోరందుకున్నాయి.

# ధాన్యం విక్రయ కష్టాలు

**సిహెచ్ వి వి రఘుబాబు**

రాష్ట్రంలో వానాకాలం (ఖరీఫ్) సీజనులో 1.50 కోట్ల టన్నులకు పైగా ధాన్యం దిగుబడి అవుతుందని వ్యవసాయ శాఖ అంచాన వేసింది. ప్రస్తుతం ముమ్మరంగా కోతలు జరుగుతున్న నేపథ్యంలో దిగుబడి అంచనాలను రూపొందించింది. తెలంగాణలో వానాకాలం సీజనులో రాష్ట్రవ్యాప్తంగా 66 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైంది. గత రెండేళ్లలో కంటే ఈసారి వరిసాగు ఎక్కువ కావడం విశేషం. గత ఏడాది (2023) వానాకాలం సీజనులో రాష్ట్రం మొత్తంగా 65.50 లక్షల ఎకరాల్లోను, అంతకు ముందు ఏడాది (2022)లో 64.47 లక్షల ఎకరాల్లోను వరిసాగైంది. అయితే ఈసారి అంతకన్నా ఎక్కువగా రాష్ట్రంలో వరిపంట సాగు చేశారు. ఈ ఏడాది వానాకాలం సీజనులో సాగైన 66 లక్షల ఎకరాల్లో 40 లక్షల ఎకరాల్లో సన్నరకాలకు చెందిన వరి, మరో 20 లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలను రైతులు సాగు చేశారు. వరి కోతకువచ్చే వరకూ అకాల వర్షాలు భారీస్థాయిలో లేకపోవడంతోపాటు, గత వానాకాలం సీజనులో మాదిరిగా చీడ,పీడలు, తెగుళ్లు తక్కువగా ఉండటంతో ఈసారి వరి ధాన్యం దిగుబడి భారీగా పెరుగుదలకు కారణమైంది. కాగా ధాన్యం కొనుగోళ్ల ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతన్నకు తేమ నిబంధనలు శాపంగా మారాయి. పెరిగిన చలి, మంచు కురుస్తుండటంతో ధాన్యంలో తేమ 17నుంచి 24శాతం వరకు ఉంటోంది. దీంతో ధాన్యాన్ని మళ్లీ అరబెట్టుకుని తీసుకురావాలని కేంద్రాల నిర్వాహకులు తిప్పి పంపుతున్నారు. ధాన్యంలో తేమ 14నుంచి 17 శాతంలోపే ఉండాలని కొనుగోలు కేంద్రాల సిబ్బంది చెబుతున్నారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన కల్లాల్లోనే ధాన్యం ఆరబోస్తున్నారు. పొలాల్లో వరికోత యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని వెంటనే కేంద్రాలకు తరలించడంతో తేమ శాతం అధికంగా ఉంటుంది. దీనికి తోడు గడ్డి, తాలు ఉంటుందని, ఆరబెట్టి శుభ్రం చేసిన ధాన్యం తెస్తే ప్రభుత్వ ధర క్వింటాకు రూ.2320 తోపాటు బోనస్ రూ.500 ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో తేమపేరుతో ధాన్యాన్ని కేంద్రాల సిబ్బంది కొనుగోలు చేయకపోవడంతోరైతులుప్రైవేటు మార్కెట్ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు తేమ శాతంలో కొంతమేర వెసులుబాటు కల్పిస్తుండటం, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలకు కొంచెం అటు ఇటుగా ప్రైవేటులోనూ లభిస్తుండటంతో రైతులు మొగ్గుచూపుతున్నారు. కొందరు రైస్‌మిల్లర్లు వ్యాపారుల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వాతావరణ భయంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు. తేమ 25నుంచి 30శాతం



పైగా ఉండటంతో తడిధాన్యం అమ్మితే తూకాల్లోకలిసి వస్తుందని, తేమశాతం తగ్గేవరకు ఉంటే నష్టపోతామన్న ఆలోచనతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఎండలేకపోవడంతో ఆరబోసిన ధాన్యంలో తేమశాతంలో మార్పురావడం లేదు. కల్లాలవద్ద కాపలా ఉండడం, అకాల వర్షాలకు పంట కాపాడుకోవడం కష్టమని భావించిన రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతుండగా, మరోవారం రోజుల్లో అంతటా పూర్తిస్థాయిలో కోతలు ప్రారంభమయ్యే అవకాశంఉంది.అయితే కొనుగోళ్ల ప్రారంభమైనప్పటి నుండి మిల్లర్లు, కేంద్రాల నిర్వహకులు ఏకమై దోపిడీకి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం కొంటుందన్న నమ్మకంతో కొందరు, దాచుకునే చోటు లేక మరికొందరు కొనుగోలు కేంద్రాలకు తరలించగా, అకాలవర్షాలు పడతాయనే భావం రైతులకు మరిన్ని కష్టాలు తెచ్చిపెడుతున్నాయి.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతోంది. రాష్ట్రంలోని కరీంగనర్, సిద్దిపేట్, ఆసిఫాబాద్, కరీంనగర్, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట్, వరంగల్, భువనగిరి, నిర్మల్, గద్వాల, ఖమ్మం, కొత్తగూడెం, తదితర జిల్లాల్లో ఇదేపరిస్థితి నెలకొంది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చిరోజులు గడుస్తున్నా తూకం వేయడంలేదు.చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో మంచి నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేవు.చలికాలం కావడంతో రాత్రి పూట కురిసేమంచుకు ధాన్యంలో తేమ శాతంపెరిగే పరిస్థితి తప్పడం లేదు.దీంతో రైతులు పగలంతా ధాన్యాన్ని ఆరబోసి సాయంత్రానికి కుప్పలు వేయాల్సి వస్తుంది. దీనికి తగినట్లుగా గన్నీ సంచులు లేక, మిల్లులకు ధాన్యం తరలించేందుకు లారీలు రాక కొనుగోళ్లలో తీవ్రజాప్యం జరుగుతోంది. ధాన్యాన్ని తూకం వేశాక కూడా రైతులకు తిప్పలు తప్పడంలేదు. ధాన్యాన్ని మిల్లులకు తరలించి, అక్కడ నుండి ట్రాక్‌షీట్ వచ్చేవరకూ రైతులే బాధ్యత వహించాల్సి వస్తుండడంతో రైతుల ఆ బస్తాలకు కాపలా కాస్తున్నారు. ఇక మద్దతు ధర విషయంలో వివిధ కేంద్రాల్లో ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,320, కామన్ రకం ధాన్యం రూ. 2,300ఇవ్వాల్సి ఉండగా రూ. 1,800కే కొనుగోలు చేస్తున్నారు. దీనికి తగినట్లుగా ధాన్యం వచ్చిన తరువాత బస్తాకు 4లేక 5కిలోల వరకూ తాలు, తప్ప పేరుతో మిల్లర్లు తగ్గించి వేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో బస్తాకు కిలో నుండి 3కిలోల వరకూ తరుగు పేరుతో కోత పెడుతున్నారు. మరికొన్ని జిల్లాల్లో 5 లేక 6 కిలోల వరకూ తగ్గింపు ఉంటోంది. ఈమేరకు నిర్వహకులు, రైస్ మిల్లర్లు అదనంగా లబ్ధి పొందుతుండగా, ఎండ, వానలేకుండా ఇంటిల్లి పాది కష్టించి పనిచేసి పండించిన రైతులు మాత్రం నష్టపోతు న్నారు. అదేమని అడిగితే ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా తాలు, మట్టి బెడ్డలు, తేమ ఉన్నాయని తిరస్కరిస్తున్నారు. మరోపక్క పలు కొనుగోలు కేంద్రాల్లో వాటి నిర్వహకులు భారీ మోసాలకు పాల్పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వేసిన తూకాలకు, వేబ్రిడ్జిలో వేసిన తూకానికి ధాన్యంలో భారీగా తేడాలు వస్తున్నాయి. ఇక ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ప్రకటించింది. సన్నరకం ధాన్యం అమ్మిన రైతుల బ్యాంకుఖాతాల్లో బోనస్ సొమ్ము జమ అవుతున్నాయి.క్వింటాలుకు 500 రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభత్వ రైతులకు చెల్లిస్తోంది. దీంతో సన్నరకాల ధాన్యం మార్కెట్లలోకి పోటెత్తుతోంది. జిల్లాల్లో ఏ మిల్లు, కొనుగోలు సెంటర్లు చూసినా సన్నధాన్యం రాసులే కనిపిస్తున్నాయి. రాష్ట్రం మొత్తం మీద దొడ్డురకం వరి రకాలను 23,58, 344 ఎకరాల్లో సాగు చేయగా, సన్న రకాలు 36,80,425 ఎకరాల్లో సాగు చేశారు. ఫలితంగా సన్నవరి ధాన్యం 48.91 లక్షల టన్నులు, దొడ్డురకం ధాన్యం 42.37 లక్షల టన్నుల మేర కొనుగోలు కేంద్రాలకు వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. క్వింటాలుకు 500 రూపాయల చొప్పున మొత్తం 48.91 లక్షల టన్నులకు 2,445 కోట్ల రూపాయలు అవ సరం అవుతాయని వ్యవసాయ శాఖ అదికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఈ సొమ్మును ఆర్థికశాఖ విడతల వారీగా విడుదల చేయనుంది. ఇందులో భాగంగా ఇటీవల తొలివిడత బోనస్ చెల్లింపునకు 1,000 కోట్ల రూపాయలను తాజాగా విడుదల చేసింది. ఈ సొమ్ము నుండి సన్నరకం ధాన్యం అమ్మిన రైతులబ్యాంకు ఖాతాల్లో ఈ కుబేర్ ద్వారా ఆర్థిక శాఖ అధికారులు జమ చేస్తున్నారు. అయితే బోనస్ వానాకాలం పంటకు వర్తింప చేస్తుండగా, యాసంగిపై రైతు ల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ విషయమై అధికారులు అవగాహన కల్పించడం లేదు. ప్రభుత్వం చెబుతున్న సన్నా ల్లోనూ అనేక రకాలు ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. వాటిపై అవగాహన కల్పించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఏ రకం సాగు చేయాలో అయోమయంలో రైతులు ఉన్నారు. ●

---

జార్ఖండ్

# గిరిజన 'హేమంత'ం

**ఎ.వి.వి ప్రసాద్**

రాజకీయ వారసత్వంతో జీవితం మొదలైనా, రాటుదేలినపోరాట యోధునిగా హేమంత్ సోరెన్ ఇప్పుడు కనిపిస్తున్నారని పలువురు విశ్లేషకులు చేసిన వ్యాఖ్య వాస్తవమే అనిపిస్తుంది. జార్ఖండ్ అసెంబ్లీకి తాజాగా జరిగిన ఎన్నికలు, వాటి ఫలితాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఆ చిన్న రాష్ట్రంలో జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం) ప్రాంతీయ పార్టీకి ఎంతటి ఘనమైన ఆదరణ ఉన్నదో అర్థమవుతుంది. రెండు రోజుల క్రితం గురువారం (28,నవంబరు) నాడు చాలా అట్టహాసంగానే ఆయన ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. జెఎంఎంతోపాటు కూటమిలో ఉన్న వివిధ పార్టీల అగ్రనేతలు కూడా కార్యక్రమానికి హాజరవడం ఒక విశేషమైతే, గిరిజనులు తమ ఇంటి వేడుకలా ఈ కార్యక్రమానికి వేలసంఖ్యలో హాజరు కావడం మరో విశేషం. గిరిజన నేతగావారి హృదయాలలో ఆయన ఇప్పటికే తన స్థానం పదిలం చేసుకున్నారు. అసెంబ్లీలోని మొత్తం 81 సీట్లలో కూటమి కట్టుబాటు ప్రకారం జెఎంఎం పోటీ చేసింది. 43 సీట్లలో మాత్రమే. వీటిలో 34 సీట్లు సొంతం చేసుకొని జార్ఖండ్ గిరిజన ప్రజలకు తాను తిరుగులేని నేతగా నిరూపించుకొన్నారు. 28 సీట్లు గిరిజనుల కోసం ప్రత్యేకంగా రిజర్వు చేస్తే వాటిలో 27 సీట్లలో విజయం సాధించి మొత్తం గిరిజనులందరికి తానే ప్రతినిధినని కూడా నిరూపించుకొన్నారు. మనీలాండరింగ్ వంటి అవినీతి కేసులలో చిక్కుకొన్నా, వాటన్నిటిని అసత్య ఆరోపణలుగా కొట్టివేసే సోరెన్ జనహృదయాల్లో తాను కొలువై ఉన్నప్పుడు తనను ఎవరు ఏం చేస్తారనే ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తున్నారు. ఓ భూ కుంభకోణం కేసులో ఇడి గత జనవరి 31న అరెస్టు చేసినప్పుడు కొద్దిసేపటికే ఆయన తన సిఎం పదవిని అలవోకగా త్యజించారు. 149రోజులు జైలు జీవితం గడిపిన తర్వాత బెయిలుపై విడుదలై ద్విగుణీకృత ఉత్సాహంతో ఎన్నికలరంగంలోకి దూకారు. జైలునుంచి విడుదలైరాగానే తిరిగిప్రమాణం చేసి మళ్లీ సిఎం పీఠం అధిష్టించారు. అయితే ఆయనపై వచ్చిన ఆరోపణల ప్రభావం ప్రజలపై ఎంతమాత్రం పడలేదని తాజా ఎన్నికలతో రుజువైందనే చెప్పాలి. ఆయన జైలుకు వెళ్లిరావడం, తీవ్రస్థాయిలో ఆరోపణలుండడం వల్లనే కాబోలు ఈసారి బిజెపికే జార్ఖండ్‌లో విజయావకాశాలున్నట్లు ఎగ్జిట్‌పోల్స్ ఘంటాపథంగా చెప్పాయి. అయితేవాటి జోస్యాలన్నిటిని వమ్ము చేస్తూపూర్తి మెజారిటీతో జెఎంఎం కూటమి తిరిగి అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో పిన్న వయస్కుడైన సిఎంగా గుర్తింపుపొందిన హేమంత్ సోరెన్ సిఎంగా ప్రమాణం చేయడం ఇది నాలుగోసారి. ఓపక్క కేంద్రప్రభుత్వంతో యుద్ధంచేస్తూనే మరో పక్క పార్టీలో అంతర్గత పోరును తట్టుకొని నాలుగోసారి (విజేతగా మూడోసారి) సిఎం అయ్యారు. జెఎంఎం అగ్రనేత,మాజీ సిఎం శిబుసోరెన్ వారసునిగా2009లో రాజ్యసభకు ఎన్నికైనా, తర్వాత జనాదరణ బాగా సంపాదించి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2010లో బిజెపి నాయకత్వంలోని



హేమంత్ సోరెన్

అర్జున్‌ముండా ప్రభుత్వంలో డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించారు.బిజెపి,జెఎంఎంకూటమి విచ్ఛిన్నంతో 2012లో ప్రభుత్వం కూలిపోయి వెంటనే రాష్ట్రపరిపాలన అమలులోకి వచ్చింది. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి తొలిసారి సిఎం పీఠం అధిష్టించారు. ఆ సమయంలో ఆయనకు కాంగ్రెస్, ఆర్జేడీ మద్దతునిచ్చాయి. 2014లో కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడంతో చాలా మార్పులు సంభవించాయి. హేమంత్ తొలివిడత సిఎం పదవికూడా ముగిసిపోయింది. ప్రతిపక్షనేతగా ఆయనఅసెంబ్లీకి హాజరుకావలసి వచ్చింది. అయితే బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం 2016లో తీసుకువచ్చిన చట్టసవరణలు ఆయనకు రాజకీయంగా కలిసివచ్చేట్లు చేశాయి. గిరిజన భూములు రక్షించే లక్ష్యంతో హేమంత్ పెద్దఎత్తున ఉద్యమం చేపట్టారు. చోటానాగ్‌పూర్ టెనెన్సీ యాక్ట్, సంతాల్‌పరగణా టెనెన్సీ యాక్ట్‌లను సవరించడానికి బిజెపి ప్రభుత్వంచాలా ప్రయత్నాలుచేసింది. వాటికి వ్యతిరేకంగా సోరెన్ చేపట్టిన ఉద్యమం గిరిజననేతగా ఆయన రాష్ట్రంలో చెలామణి అయ్యారు.తర్వాత కాంగ్రెస్, ఆర్‌జెడి సహకారంతో 2019లో మరోసారి సోరెన్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పట్లో జెఎంఎం గెలుచుకున్నవి 30సీట్లు మాత్రమే. అయినా అధికస్థానాలు కలిగిన పార్టీగా జెఎంఎం సంకీర్ణప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మైనింగ్ లీజు విషయంలో ఆ సమయంలో ఆయనపై తీవ్రఆరోపణలువచ్చాయి. 2022లో ఎమ్మెల్యే పదవిపై అనర్హతవేటు పడుతుందని అర్థంకావడంతో దాని నుంచి బయటపడే ప్రయత్నంచేసి పదవి నిలుపుకున్నారు. గత జనవరిలోఆయన అరెస్టయిన సమయంలోభార్య కల్పనరంగంలోకి ప్రవేశించి తనభర్తను కేంద్రం అన్యాయంగా అరెస్టు చేయించిందంటూ ప్రజలలో చైతన్యం తేవడానికి చాలా ప్రయత్నించారు. ఇడి, సిబిఐ కేంద్రంచేతిలో కీలుబొమ్మలుగామారాయనీ, ప్రత్యర్థులపై ప్రయోగించడానికే కేంద్రం వాటిని ఉపయోగిస్తున్నదనీ ప్రజలలో ప్రచారం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత దాదాపు 200 ప్రచార సభల్లో పాల్గొని భర్తకు మద్దతుగా ఆమె నిలబడ్డారు. సోరెన్ తాజా విజయంలో ఆమె కృషికూడా ఎక్కువ పనిచేసిందనే చెప్పాలి.అసత్య ప్రచారానికి బిజెపి 500 కోట్లు ఖర్చుచేసిందని బహుశా అందుకేనేమో!కచ్చితంగా అధికారంలోకి వస్తుందని విశ్లేషకులు అంచనా వేసిన బిజెపి 21సీట్లకంటె సాధించలేకపోయింది. ఏదిఏమైనా గిరిజననేతగా పేరు పొందిన సోరెన్ మూడోసారి ఎన్నికై సిఎం పదవిని చేపట్టారు గనుక మరింత రాజకీయపరిణతితో కూటమిలోని పార్టీలను కలుపుకొని నడుస్తారనేభావించాలి. కేవలం 16 సీట్లున్న కాంగ్రెస్‌పార్టీ ఐదు మంత్రిపదవులను డిమాండ్‌చేస్తోంది.మూడు ఇస్తాననిసోరెన్ అంటున్నారు.దానివల్ల ప్రతిష్టంభనఏర్పడి పూర్తి కేబినెట్ ఏర్పాటు వాయిదాపడింది. ఈ సమస్యను ఆయన తేలికగానే అధిగమిస్తారనుకోవాలి. అయితే ఆయనపైగల కేసులింకా అలాగేఉన్నాయి. వాటినుంచి ఎలాబయటపడతారో చూడాలి. ●

---

అమెరికా

# ట్రంప్ మదిలో ట్రిలియనీర్ మస్క్!

**గన్ని మోహన్**

ప్రపంచంలో ఇప్పుడు ఏ నోట విన్నా ఎలాన్ మస్క్‌పేరే వినిపిస్తుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్‌ట్రంప్‌కు మద్దతు పలికి ఆయన విజయానికి ప్రత్యక్ష కీలకపాత్ర పోషించిన తర్వాత ఈ ట్రిలియనీర్ పారిశ్రామికవేత్త పేరు ఇప్పుడు మారుమోగిపోతోంది. ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికంటే సంపన్న పారిశ్రామికవేత్తగా నిలిచిన ఎలాన్‌మస్క్ జీవితాన్ని ఆసాంతం గమనిస్తే కష్టపడి అంచలంచెలుగా పైకివచ్చిన వ్యక్తి. ప్రస్తుతం ఆయన మొత్తం నికరఆస్తులు 290 బిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో చూసుకుంటే 24.47 లక్షలకోట్లు. ఆటోమొబైల్ కంపెనీ టెస్లా, అంతరిక్ష పరిశోధనల సంస్థ స్పేస్‌ఎక్స్‌తో పాటు ఇటీవలే కొనుగోలు చేసిన ట్విట్టర్ అదే ఎక్స్ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ఇలా రకరకాలుగా విస్తరించుకుంటూ వెళుతున్న ఎలాన్ మస్క్ మూలాలు దక్షిణాఫ్రికాలో ఉన్నాయంటే ఎవ్వరూ నమ్మరు. కానీ అదే నిజం. దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియాలో జన్మించిన మస్క్ ఇంట్లో తయారుచేసిన ఈస్టర్ చాక్లెట్ ఎగ్స్‌ను ఇంటింటికీ అమ్మేవాడు. 12 ఏళ్ల వయసులో మొదటి కంప్యూటర్‌గేమ్ వృద్ధిచేసి తన ఎదుగుదలకు పునాదులు వేసుకున్నారు. అయితే తల్లితండ్రుల విడాకులు, స్కూలులో తనపట్ల వేధింపులు, ఒక రకమైన మానసిక సమస్యతోను ఇబ్బందులు పడుతుండేవాడు. కళాశాల విద్యకోసం కెనా, అక్కడి నుంచి అమెరికాకు వెళ్లి పెన్సిల్వేనియా యూనివర్సిటీలో భౌతిక ఆర్థికశాస్త్రాలు చదువుకున్నాడు. స్టాన్‌ఫోర్డ్‌లో చదవాలనుకున్న ఇక పరిశ్రమల రంగంవైపు మళ్లి డాట్‌కామ్ బూమ్ తరుణంలో రెండు టెక్నాలజీ స్టార్టప్‌లు తెచ్చాడు. ఒకటి వెబ్‌సాఫ్ట్‌వేర్‌సంస్థ, రెండోది ఆన్‌లైన్ బ్యాంకింగ్ కంపెనీ, తర్వాత అది పేపాల్‌గా మారింది. 2002లో ఈబేకు సుమారు 12,658 కోట్లకు అమ్మేసారు. కొత్తరాకెట్ కంపెనీ స్పేస్ ఎక్స్‌తో మస్క్ దశ తిరిగింది. నాసాకు తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయం రూపొందించే లక్ష్యంతో పనిచేస్తోంది. ఇక విద్యుత్ కార్లకంపెనీ టెస్లా బోర్డుకు మస్క్ ప్రెసిడెంట్. 2022లో సోషల్ మీడియా ట్విట్టర్ తనను బ్యాన్ చేసిం దన్న కోపంతో ఏకంగా ఆ కంపెనీనే కొనేశారు. అయితే టీమ్ వేతనాలలో భారీ కోత విధించడంతో పాటు ఉద్యోగులను కూడా పెద్దఎత్తున తొలగించారు. కంపెనీపేరు ట్విట్టర్ నుంచి ఎక్స్‌గా మారింది. ప్రీమియం చందాలను కూడా తెచ్చి వాణిజ్యీకరణ చేసారు. అయితే కంపెనీని 44 బిలియన్ డాలర్లకు కొనుగోలుచేస్తే ఇప్పుడు 19 బిలియన్ డాలర్ల విలువలకు పతనం అయింది. చాట్‌జిపిటికి పెట్టుబడులు పెట్టిన మస్క్ ఆ తర్వాత తానే సొంతంగా ఎక్స్ ఎఐని స్థాపించి ఆ రంగంలో కూడా తిరుగులేని శక్తిగా మారేందుకు బీజం వేసాడు. డిజిటల్ కరెన్సీలను ప్రోత్సహించిన మస్క్ బోరింగ్ కంపెనీ, న్యూరాలింక్ తోసహా అనేక ఇతర చిన్న కంపెనీల్లో కూడా పెట్టుబడులు పెట్టాడు. పారిశ్రామిక రంగంలో తిరుగులేని శక్తిగా మారిన ఎలాన్ మస్క్ ప్రత్యేకించి అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు ఎందుకు మద్దతు ఇచ్చారన్నదే ఇప్పటికీ అమెరికన్లలో మిలియన్ డాలర్ల ప్రశ్న. 2002లో అమెరికా పౌరసత్వం పొందిన మస్క్ చాలా కాలం రాజకీయ పార్టీ ముద్రపడకుండా జాగ్రత్తలు పడ్డారు. తాను హాఫ్ డెమొక్రాట్, హాఫ్ రిపబ్లికన్ అని రాజకీయంగా మితవాద ఇండి పెండెంట్ అంటూ తనకుతానే చెప్పుకునేవాడు. బరాక్ ఒబామా, హిల్లరీ క్లింటన్‌లకు ఓటువేసానని, జోబైడెన్‌కు అయిష్టంగానే ఓటువేయాల్సి వచ్చిందంటూ నిష్కర్షగా చెపుతుంటారు. కొన్నేళ్లుగా ఆయన డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతిస్తూ వచ్చారు. ట్రంప్ ప్రచారానికి ప్రధాన మద్దతు దారుగా ఉంటూ తానే స్వయంగా ట్రంప్‌తో పాటు ప్రచార ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రపంచదేశాల్లో విస్తరించిన సందర్భంగా అక్కడి ప్రభుత్వాలతో తనకు ఎదురయిన అనుభవాలతో ఇప్పుడు ఏదో ఒక పార్టీకి మద్దతివ్వడమే మేలని భావించిన మస్క్ ముందు నుంచీ డెమొక్రాట్లను వ్యతిరేకిస్తూ వచ్చారు. ట్రంప్ తరపున ప్రచారంలో కూడా అనేక వివాదాలకు కేంద్ర బిందువు అయ్యారు. అనవసర ఖర్చును తగ్గిస్తామని, బ్యూరోక్రసీని నియంత్రించాల్సిన అవసరం ఎంతో ఉందని చెపుతున్న మస్క్ ఇప్పుడు వివేక్ రామస్వామితో కలిసి ప్రత్యేక విభాగంలో పని చేస్తున్నారు. ఈ విభాగం పని అనవసర ఉద్యోగుల పేరిట వారిని క్రమబద్ధీకరించడం, అధికార యంత్రాంగం గుత్తాధిపత్యాన్ని నియంత్రించే చర్యలు పర్యవేక్షిస్తారు. ట్రంప్ తాను గెలిచిన వెంటనే మస్క్‌కు ముందు కేబినెట్‌లో స్థానం ఇవ్వాలని భావించినా అది రాజ్యాంగపరంగా వీలుకాకపోవడంతో బయటి నుంచే ప్రభుత్వం నామినేట్ చేసిన కమిటీకి ప్రతినిధిగా వ్యవహరించాలని నిర్ణయించారు. అధ్యక్ష ఎన్నికల్లో మిలియన్ డాలర్లు బహుమతి ఇస్తామని చేసిన ప్రకటనలు కూడా ట్రంప్‌కు కొంత చిక్కులు తెచ్చినా తర్వాత సర్దుబాటు జరిగింది. ట్రంప్‌కు మద్దతుగా ఆయన రాజకీయ విరాళాలు భారీ మొత్తంలో సేకరించారు. ట్రంప్‌కు తాను మద్దతిస్తున్నట్లు తన ఎక్స్‌వేదికగా పదేపదే ప్రకటించారు. ఒకప్పుడు ట్రంప్‌ను బ్యాన్ చేసిన సంస్థ మళ్లీ ఆయన ఖాతాను ప్రారంభించేటట్లు చేసారు. జోబైడెన్ అనుసరించిన ఇమ్మిగ్రేషన్ విధానం వ్యతిరేకిస్తూ వచ్చిన మస్క్ గన్‌కంట్రోల్ వ్యవస్థను కూడా విమర్శించారు. స్వీయ రక్షణకు ఆయుధం అవసరమని వాదిం చారు. బైడెన్ పారిశ్రామిక విధానాలు, ప్రపంచ దేశాలతో సంబంధాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చిన మస్క్ స్వతహాగానే బిజినెస్ పొలిటీ షియన్ అయిన ట్రంప్‌కు చేరువయ్యాడు. ఇప్పుడు తన పారిశ్రామిక విస్తరణకు రాజకీయ మద్దతుకూడా ఎంతో అవసరం అని చాలా లేటుగా గుర్తించిన మస్క్ ఇప్పుడు ట్రంప్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా ఆ రంగంలో కూడా కాలుపెట్టినట్లు నిరూపించుకున్నారనే చెప్పాలి. ●



ఎలాన్ మస్క్

---

# రహదారుల నిర్మాణంలో టాప్‌గేర్‌లో భారత్

**యేచన్ చంద్ర శేఖర్**

ఇటీవలి సంవత్సరాలలో భారతదేశం తన రహదారుల పరిధిని విస్తరించడంలో అసాధారణమైన పురోగతి సాధించింది. 63,71,847 కిలోమీటర్ల రహదారులతో చైనాను తోసిరాజని అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద రోడ్డు నెట్‌వర్క్ గల దేశంగా అవతరించింది. దీర్ఘకాలికంగా ప్రతిష్టాత్మకమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా దేశం మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచడానికి ప్రభుత్వం తన నిబద్ధతను ప్రదర్శిస్తోంది. ముంబై,పూణే ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభించడం, ఎక్స్‌ప్రెస్‌వేలు ఇతర రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషిచేయడంతో మీడియా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని తరచుగా ఎక్స్‌ప్రెస్‌వే మ్యాన్ ఆఫ్ ఇండియా"గా పిలుస్తుంటుంది. 29మే 2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆయన నిరంతరాయంగా రవాణా రహదార్లశాఖలను నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ప్రధాని తన మొదటి మంత్రివర్గ ఏర్పాటు సందర్భంగా పోర్ట్‌ఫోలియోను ఎంచుకోవలసిందిగా గడ్కరీకి సూచించగా ఆయన రక్షణ, హోం,ఆర్థిక శాఖలు పొందే అవకాశం ఉన్నప్పటికీ, రవాణా,రహదారుల మంత్రిత్వ శాఖను చేపట్టేందుకే మొగ్గుచూపారు. గడ్కరీ తనపదవీ కాలంలో సాధించిన విజయాలను పంచుకుంటూ, గత తొమ్మిదేళ్లలో హైవేలను మెరుగుపరచడం, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలను తయారు చేయడంపై భారతదేశం దృష్టి సారించిందని చెప్పారు. దేశంలోని మౌలిక సదుపాయాలను మరో స్థాయికి తీసుకెళ్లేందుకు తాను అన్నివిధాలా ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు.64.5శాతం సరుకు రవాణా మొత్తం ప్రయాణీకుల ట్రాఫిక్‌లో 90శాతం భారతీయ రహదార్ల ద్వారానే జరుగుతోంది. నగరాలు, పట్టణాలు,గ్రామాల మధ్య సౌకర్యాలు మెరుగుపడటంతో కొన్నేళ్లుగా రోడ్డు రవాణా క్రమంగా పెరిగింది. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుండి 2015 వరకు దేశంలో కేవలం 54 లక్షల కిలోమీటర్ల రోడ్లు నిర్మించబడగా, గత తొమ్మిదేళ్లలో దాదాపు 10 లక్షల కిలోమీటర్ల రహదార్ల నిర్మాణంతో భారతదేశం ప్రపంచంలోనే రెండవ స్థానానికి ఎగబాకింది. రహదార్ల విస్తరణతో,గత తొమ్మిదేళ్లలో టోల్ వసూళ్ల రూ. 4,770 కోట్ల నుంచి రూ.41,352కు చేరింది. రాబోయే సంవత్సరాల్లో కేంద్రప్రభుత్వం రూ.71.30 లక్షల కోట్ల బడ్జెట్ వసూళ్లను లక్ష్యంగా నిర్దేశించుకుంది. 6.60 మిలియన్ కిలోమీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌తో అమెరికా అగ్రగామిగా ఉండగా తరువాతి స్థానాల్లో భారతదేశం,చైనా ఉన్నాయి. ప్రముఖ నెట్‌వర్క్‌లలో భారతదేశం గోల్డెన్ క్వాడ్రిలేటరల్, చైనా నేషనల్ ట్రంక్ హైవే సిస్టమ్ రష్యా ట్రాన్స్ సైబీరియన్ హైవే ఉన్నాయి. 2024నాటికి అమెరికా 65,86,610,భారత్63,71,847, చైనా 52,00,000, బ్రెజిల్ 20,00,000, రష్యా 12,83,387, జపాన్ 12,18,772, ఫ్రాన్స్ 10,90,059, కెనడా 10,42,300, ఆస్ట్రేలియా 873,573 జర్మనీ 8,30,000 కిమీ రోడ్డు నెట్‌వర్క్‌తో పొడవైన రహదారులు గల దేశాల జాబితాలో ముందున్నాయి. సకాలంలో నిర్వహణతో పాటు బడ్జెట్ కేటాయింపులో పెరుగుదల కారణంగా దేశంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ గణనీయంగా విస్తరించింది. మార్చి, 2014లో సుమారు 91,287 కి.మీ నుండి జూలై 25, 2024 నాటికి దాదాపు 1,46,126 కి.మీ.లకు పెరిగింది. ఆశ్చర్యమేమిటంటే, భారతదేశం జూన్ 2022లో కేవలం 105 గంటల 33నిమిషాల వ్యవధిలో 75కిలోమీటర్ల బిటుమినస్ కాంక్రీట్ రోడ్డును నిర్మించి 2023లో గిన్నిస్ ప్రపంచ రికార్డును సృష్టించింది. ఒక్క 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే, భారతదేశం 12,349 కి.మీ జాతీయ రహదారులను నిర్మించింది. ఇది గత సంవత్సరంకంటే 20శాతం ఎక్కువ. మౌలిక సదుపాయాలు, ప్రత్యేకించి రహదార్లు సరుకు రవాణాకు పెద్దపీట వేస్తూ కేంద్రప్రభుత్వ రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 1.68 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయించింది. రహదారి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే క్రమంలో ప్రభుత్వం "పర్వతమాల పరియోజన" అని కూడా పిలువబడే నేషనల్



రోప్‌వేస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ చేపట్టడంతో పాటు, భారతమాల పరియోజన కార్యక్రమంలో భాగంగా 35 మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. భారతదేశానికి తలమానికమైన బంగారు చతుర్భుజం వంటి ప్రధాన ప్రాజెక్టులు గ్రామీణ, పట్టణ ప్రాంతాలను సమర్థవంతంగా అనుసంధానించడం ద్వారా దేశం అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థకు మద్దతునిస్తున్నాయి. నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా రూ. 1,000 కోట్ల అంచనా వ్యయంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఐదు రాష్ట్రాలు హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్,గుజరాత్ మహారాష్ట్ర గుండా దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబైలను అనుసంధానిస్తూ చేపట్టిన ఢిల్లీ ముంబై ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం అక్టోబర్ 2025 నాటికి పూర్తికానుంది. పూర్తయిన తర్వాత ఇది దేశంలోనే అతిపొడవైన ఎక్స్‌ప్రెస్‌వే అవుతుంది. ఉత్తరాన శ్రీనగర్ నుండి దక్షిణాన కన్యాకుమారి వరకు 4,112 కిలోమీటర్లకు విస్తరించిన నేషనల్ హైవే 44 భారతదేశంలోని అతి పొడవైన రహదారి. ఇది జమ్మూకాశ్మీర్, పంజాబ్, ఆంధ్రప్రదేశ్,కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు, హర్యానా,ఉత్తరప్రదేశ్, ఢిల్లీ మధ్యప్రదేశ్‌తో సహా 11రాష్ట్రాలు దాదాపు 30 ముఖ్యమైన నగరాలను కలుపుతుంది.నేషనల్ హైవేస్ అథారిటీఆఫ్ ఇండియా నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు దేశంలోని చాలా జాతీయ రహదారుల నిర్మాణం, అభివృద్ధి నిర్వహణ బాధ్యతలు చేపడతాయి. వాహన శ్రేణి ప్రయాణించే దూరాన్నిబట్టి ఈ ఎక్స్‌ప్రెస్‌వే పై వాహనాలు టోల్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కార్లకు కనిష్టం రూ.90,గరిష్టం రూ.500గా ఉంటుంది. కాగా ఈ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి వస్తే ఢిల్లీ ముంబైల మధ్య ప్రయాణ సమయం 24 గంటల నుండి 12గంటలకు తగ్గుతుంది. గంటకు 120కి.మీ. గరిష్ట వేగం నిబంధన ఉండే ఈ ఎక్స్‌ప్రెస్‌వే పై ప్రతి 10కిలో మీటర్లకు కెమెరాలు ఏర్పాటుచేసి వాహనాల వేగాన్ని పర్యవేక్షించనున్నారు.ప్రయాణీకుల సౌకర్యార్థం ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై హోటల్స్, ఏటిఎంలు, ఫుడ్‌కోర్టులు,కిరాణా దుకాణాలు, పెట్రోల్ బంకులు, విద్యుత్ ఆధారిత వాహనాల కోసం ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రమాదాలు సంభవించిన సందర్భాలలో క్షతగాత్రులకు వైద్యసహాయం అందించేందుకు ట్రామా సెంటర్లతో పాటు ప్రతి వంద కిలోమీటర్లకు ఒక హెలిప్యాడ్ సదుపాయం కల్పిస్తున్నారు. శ్రీనగర్ నుండి కన్యాకుమారి 3,745 కిమీ (ఎన్ హెచ్: 44), పోరుబందర్ నుండి అసోంలోని సిల్చార్ 3,507 కిమీ (ఎన్ హెచ్ 27), ఢిల్లీ నుండి చెన్నై 2,807కిమీ, పంజాబ్ లోని సంగ్రూర్ నుండి కర్ణాటక లోని అంకోలా 2,317 కిమీ ((ఎన్ హెచ్ 52), ఉత్తరాఖండ్‌లోని సితార్గంజ్ నుండి ఆంధ్రప్రదేశ్ లోని ఇబ్రహీంపట్నం 2,040 కిమీ ((ఎన్ హెచ్ 30), మేఘాలయలోని జోరాబాట్ నుండి మిజోరంలోని సెల్లింగ్ 1,873 కిమీ (ఎన్ హెచ్6), గుజరాత్‌లోని హజీరా నుండి ఒడిశా లోని పారాదీప్ పోర్ట్ 1,781కిమీ (ఎన్‌హెచ్ 53), పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు తీరం నుండి చెన్నై 1,711 కిమీ (ఎన్‌హెచ్ 16) పన్వేల్ నుండి కన్యాకుమారి 1,622 కిమీ (ఎన్‌హెచ్ 66) లు మన దేశంలోని పది పొడవైన జాతీయ రహదారులు. కాగా గోల్డెన్ క్వాడ్రిలేటరల్ భారతదేశంలోని నాలుగు కీలక మెట్రోనగరాలైన ఢిల్లీ (ఉత్తరం), కోల్‌కతా (తూర్పు), ముంబై (పశ్చిమ) చెన్నై (దక్షిణ) ప్రాంతాలలోని ప్రధాన పారిశ్రామిక, వ్యవసాయ సాంస్కృతిక కేంద్రాలను అనుసంధానించే ఒక ప్రధాన జాతీయ రహదారి నెట్‌వర్క్. భారతదేశంలో 1,01,011 కిలోమీటర్ల పొడవుతో 200 కంటే ఎక్కువ జాతీయ రహదారులు 1,31,899 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు ఉన్నాయి. జాతీయ రహదారులు సాధారణంగా రెండు అంకెల సంఖ్యలను కలిగి ఉంటాయి. అయితే, మూడుఅంకెల సంఖ్యగల హైవేలు ప్రధాన రహదారుల శాఖలు. భారతదేశంలోని మొత్తం రహదారులలో జాతీయ రహదారులు కేవలం1.8శాతం మాత్రమే అయిన ప్పటికీ, అవి దేశంలోని రహదారి ట్రాఫిక్‌లో 40 శాతం భారాన్ని నిర్వహించడం గమనార్హం. భారతదేశ ఆర్థిక వ్యవస్థ లో ఎన్‌హెచ్ 44కీలకపాత్ర పోషిస్తుంది. సెప్టెంబర్ 2024 నాటికి దేశవ్యాప్తంగా 44 ఎక్స్‌ప్రెసవేలు ఉండగా దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 13 ఎక్స్‌ప్రెస్‌వేలున్నాయి. ●



గాంధీభవన్‌లో శనివారం తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బిఆర్ఎస్ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టండి

## కెసిఆర్ అడ్డగోలు అక్రమాలతో రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పలకుప్ప

## బిజెపి, బిఆర్ఎస్ కుట్రలను కార్యకర్తలు సాగనివ్వద్దు

## ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి చేపట్టిన పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై మనపాలనపై అబద్దపు ప్రచారం చేస్తూ రాజకీయంగా పూట గడుపుకొంటున్న బిఆర్ఎస్ ఎత్తుగడలను ఎదుర్కొనాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. గాంధీభవన్‌లో శనివారం తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ సమావేశం చైర్మన్ బెల్లయ్య నాయక్ నాయకత్వంలో జరుగగా అందులో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి బిఆర్ఎస్ ఒక్కటై మనపై చేస్తున్న అబద్ధపు ప్రచారంను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కిన కెసిఆర్ కుటుంబంతో సహా బిఆర్ఎస్ నాయకులు పదేళ్ళుగా రాష్ట్ర వనరులను ఇష్టం వచ్చినట్లు దోచుకున్నారని ఆరోపించారు. అడ్డగోలుగా అక్రమాలు చేస్తూ ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పుల రాష్ట్రంగా నాశనం చేసిన చరిత్ర కెసిఆర్ పాలనదని ఆవేదన చెందారు. ఏడాది కాలంగా మనం మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, రూ.500కు వంటగ్యాస్, 200యూనిట్లు ఉచిత కరెంటు, సన్నాలకు రూ.500 క్వింటాల్‌కు బోనస్ వంటి ఆరు గ్యారెంటీలు అమలు చేసినా బిఆర్ఎస్ బిజెపి మనపై అబద్దాలను ప్రచారం చేస్తున్నదని పెద్ద ఎత్తున కాకర్యకర్తలు గ్రామాలకు తరలి గ్రామీణులకు వివరించాలని ఆయన సూచించారు. చేసిన పనులు మనం చెప్పుకోకపోతే వెనుకబడి పోతామని బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతు బంధు ఇచ్చామని రైతు రుణమాఫీ కోసం 18వేల కోట్లు వెచ్చించామని తెలపాలని ఇంకా మూడు వేల కోట్ల రూపాయలు ఇచ్చామని తెలిపారు.50వేల ఉద్యోగాలు పది నెలలలో ఇచ్చిన ఘనత మనదే అని ఆయన అన్నారు. బిజెపి మతతత్వ ప్రచారంతో లబ్ది పొందతుందని ఆయన విమర్శించారు. ప్రధానమంత్రి మోడీ అబద్దాలను బిజెపి మతత్వంను ప్రజలకు వివరించి వారికి వాస్తవాలు తెలిపేలా చైతన్యం కల్పించాలని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ దేశానికి ప్రధాని అవ్వాల్సిన అవసరం ఉంది. దేశాన్ని ఒక్కతాటిపై తెచ్చిన అభివృద్ది చేసే లక్ష్యంతో రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర చేశారని ఆయన గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ స్వాతి ముత్యం కులగణన ఎంత అవసరమో ఆయన చెప్పడమే కాదు తెలంగాణలో అమలు చేశారని అన్నారు.

ఎఐసిసి జాతీయనాయకుడు కొప్పుల రాజు మాట్లాడుతూ రాహుల్‌ను దేశానికి ప్రధానమంత్రిని చేసేందుకు మనం కృషి చేయాలని నాగార్జునసాగర్‌లో అందుకోసం వారం రోజులు ఆదివాని క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆదివాసి సమ్యలపై లోతుగా చర్చకూడా చేయబడుతుందని ఆయన వివరించారు. ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ రోజుకు ఏడు నుంచి ఎనిమిది అంశాలపై అక్కడ సుదీర్ఘమైన చర్చ జరిపి అక్కడ వెల్లడైన అభిప్రాయాలను దేశంలోని ఆదివాసీ జీవనశైలిలో మార్పులతోపాటు జీవనోపాధులు కల్పించేవిధంగా విధాన రూపకల్పన చేయాలని అన్నారు.

# కెటిఆర్.. నీ భాషను మార్చుకో

## ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకమరామారావు వాడూ వీడు అంటూ సంభోదిస్తూ మాట్లాడటం తగదని ఆయన ముందుగా తన భాషను మార్చుకోవాలని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ హితవు చెప్పారు. సిఎల్‌పిలో ఆయన శనివారం మాట్లాడుతూ ప్రజాస్వామిక పంథాలో విమర్శిస్తే మేము స్వాగ తిస్తామని బూతులు తిడితే మేం కూడా వాడువీడు అంటూ మాట్లాడు తామని ఆయన హెచ్చరించారు. ఆయన భాష వల్ల సిరిసిల్ల పరువు పోతున్నదని, ప్రజలు కూడా ఆయనను అదుపు చేయాలని ఆదిశ్రీనివాస్ సూచించారు. మీ కార్యకర్తలను కాపాడుకోవడానికి ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే వూర్కోమని ఆయన అన్నారు.

బిఆర్ఎస్ హయాంలో పేదల భూములు లాక్కొని పెద్దలకు పంచిపెట్టారని ఆయన ఆరోపించారు. మీ వల్ల జరిగిన పొరపాటును సరిదిద్దుతున్నామని దళిత గిరిజనులకు చెందాల్సి భూములు ఉన్నత వర్గాలకు చెందితే దానిని సరిదిద్దడం తప్పా అని ఆయన నిలదీశారు. మొన్న కలెక్టర్‌పై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై ఐఎఎస్ సంఘం స్పందిస్తే ఇప్పటికీ వారికి కెటిఆర్ సంజాయిషీ ఇచ్చుకోలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి తాత వరకు ఎందుకయ్యా మొన్నటి ఎన్నికలలో టిపిసిసి అధ్యక్షుడిగా ఉండి మీ అయ్యను ఓడించి ఫామ్‌హౌజ్‌కు పరిమితం చేయలేదా అని ఆయన అన్నారు. అసెంబ్లీకి రావాలని మీ అయ్యను రేవంత్ అంటున్నారు.. రమ్మను అని సవాల్ చేశారు.

# మాటల ప్రభుత్వానికి చేతల సర్కారుకు తేడా ఇదే

## మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో యువత నిరద్యోగం ఏడాదిలో 22.3 నుంచి 18.1శాతంకు పడిపోయిందిన నాటి మాటల ప్రభుత్వంకు నేటి చేతల ప్రభుత్వానికి తేడా స్పష్టంగా తెలు స్తున్నదని ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కేంద్ర కార్మిక బలగం త్రైమాసిక నివేదిక ఇటీవల వెల్లడించిన నివేదకిలో గత ఏడాది జూలై -సెప్టెంబరులో 22.9శాతం ఉండగా జూలై 2024లో నిరుద్యోగం శాతం 18.1కు నమోదైందని తెలిపారు. ఆరునెలలో ప్రైవేటు ప్రభుత్వ రంగాల్లో ఉపాధది అవకాశాలు పెంచడమే దీనికి కారణమని రామ్మోహన్ స్పోట్శత్కర్షలు చెప్పుకున్నారు.

# రైతులకు న్యాయం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**మహేశ్వరం, నవంబరు 30, ప్రభాతవార్త :** పేదల సంక్షేమం, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శనివారం మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సి.సబితాఇంద్రారెడ్డి, పట్టణ మౌళిక సదుపాయాలు, ఆర్థిక సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ కార్యదర్శి బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, పీసీసీ కార్యదర్శి వై. అమరేందర్‌రెడ్డి, మహేశ్వరం ఇంఛార్జి కేఎల్ఆర్, సీనియర్ నాయకులు దీపా భాస్కర్‌రెడ్డి, 14వ డిడిజన్ కార్పొరేటర్ భారతమ్మ కొమురయ్య యాదవ్‌లతో కలిసి మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జల్‌పల్లి,తుక్కుగూడ మున్సిపాలిటీలతో పాటు కందుకూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆర్.సి.ఐ రోడ్డు ప్రక్కన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో 1.43లక్షల వ్యయంతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, బడంగ్‌పేట్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, తుక్కగూడలో 1.43లక్షల వ్యయంతో మరొక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి, రూ.కోటి50లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కందుకూరు మండలంలోని నెదునగల్ జడ్డి రోడ్డు నుండి మద్దెలకుంట తండా వరకు రూ.8కోట్లు వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

# సిఎంపై బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ప్రజాపాలనపై పింకు పార్టీమీడియా, బిఆర్ఎస్ శ్రేణులు తప్పుడు ప్రచారం చేస్తున్నదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ గురుకులాల సెక్రటరీగా పనిచేసిన ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్ పెద్ద కుట్రకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. పేద ఎస్సీ ఎస్టీ బిసి విద్యార్థుల విషయంలో ఆర్ఎస్ అంత నీచానికి పాల్పడుతారా అని ఆయన ప్రశ్నించారు.ముఖ్యమంత్రి 40శాతం డైట్ చార్జీలు పెంచితీ మంచి భోజనం ఇవ్వడం చూసి ఓర్వలేర ఫుడ్ పాయిజన్ అంటూ కుట్రలు చేస్తున్నారని పదేళ్ళే అధికారంలో ఉండి డైట్ చార్జీలు పెంచారా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు బుద్ధిచెప్పిన బిఆర్ఎస్ నేతలలో మారడంలేదని ఆయన అన్నారు.

# గురుకులాలపై ఆర్ఎస్ ప్రవీణ్ ముఠాల కుట్రలు

## ముఖ్యమంత్రి రేవంత్‌పై కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** కెటిఆర్ కెసిఆర్ ఆదేశాలతో తన మనుషులతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కుట్రలకు తెరలేపారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆరోపించారు. శనివారం అసెంబ్లీలో మేడిపల్లి సత్యం మాటాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నాం అని అన్నారు. ఇలాగే వ్యవహరిస్తే ప్రజలు తరిమి కొట్టడం ఖాయమని సత్యం హెచ్చరించారు.మీ తీరు సరిగ్గా లేకనే ప్రజలు మిమ్మల్ని ఇంటికి పంపించారు ఆయన ఎద్దేవా చేశారు.పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకుండా తెలంగాణ ప్రజలు మెడలు పట్టి మీ పార్టీని తెలంగాణ సమాజం నుంచి గెంటేశారని ఐనా వీరికి అహంకారం పోలేదని ఆయన అన్నారు.

వచ్చే స్థానిక ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు వస్తాయి అని ఆయన జోస్యంచెప్పారు. ఆరుగ్యారెంటీల పేరుతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చుతున్నాం అని సత్యం తెలిపారు.ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరు ను చూసి ఓర్వలేక కుట్రలు చేటున్నారు.ఆఖరికి పిల్లలు చదువుకునే గురుకులాల మీద కుట్రలు చేస్తున్నారు.గురుకులాలపై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ముఠాలు కుట్రలు చేస్తుంది. విద్యా వ్యవస్థను మేము బలోపేతం చేస్తున్నాం. డైట్ ఛార్జీలు గత ప్రభుత్వం ఒక్కసారైన పెంచారా? ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ దొరపాలనలో నోరు మెదపని ప్రవీణ్‌కుమార్ ప్రజాప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్వేరో వంటి ప్రయివేట్ సైన్యంను తయారుచేశారని ఆయనపై విమర్శలు చేశారు. గతంలో గువ్వల బాలరాజు, బాల్క సుమన్ చేసిన కామెంట్స్ నిజమేనేమో అనిపిస్తుంది. ప్రవీణ్‌కుమార్ విద్యార్థి లోకానికి క్షమాపణ చెప్పాలి. రెచ్చగొట్టే చర్యలు మాను కోవాలి, లేకపోతే మీకు పుట్టగతులు ఉండవని ఆయన అన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

# పత్తి గోదాములో చెలరేగిన మంటలు

## కోట్ల విలువచేసే ఆస్తి నష్టం

**మేడ్చల్, నవంబరు 30, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు ఓ గోదాములో జరిగిన అగ్ని ప్రమాదంలో కోట్లాది రూపాయల విలువైన పత్తి కాలి బూడిదైన సంఘటన మేడ్చల్ మండలంలోని చోటు చేసుకుంది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ గ్రామ శివారులోని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి గోదాములో శనివారం మద్యాహ్నం ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని మంటల చెలరేగాయి. దీంతో అందులో కార్మికులు అప్రమత్తమై బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి నాలుగు వాహనాలతో మండలను ఆర్పారు. మంటలు అదుపులోకి వచ్చినా రాత్రి వరకు పూర్తి స్థాయిగా మంటలు చల్లారే వరకు చర్యలు తీసుకున్నారు. కాగా సిసిఐ ఆధ్వర్యంలో నిలువ ఉంచిన ఈ గోదాములో అంటుకున్న మండలను నాలుగు వాహనాలతో మండటలను ఆర్పామని, పక్కనున్న గోదాములకు మంటలు అంటుకోకుండా చర్యలు తీసుకున్నామని డీఎఫ్ఓ జై కృష్ణ ఈ సందర్భంగా తెలిపారు. కంప్రెస్డ్ కాటన్ ఉండటంతో మంటలు పూర్తిగా ఆర్పడానికి ప్రయత్నం చేస్తున్నాము. పైన మంటలు ఆరినట్లు కనపడినా కాటన్ లోపల అగ్గి రాజుకునే ఉండే అవకాశం ఉండనున్నందున రోజు మొత్తం మంటలను ఆర్పాల్సి వస్తుందని చెప్పారు. ఎలాంటి ప్రాణనష్టం కాని, గాయాలు కాని కాలేదని ఈ ప్రమాదంలో పెద్దఎత్తున ఆస్తినష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రమాదం జరుగడానిక గల కారణాలు, ఆస్తి నష్టం విలువ ఎంత అనేది మంటలు చల్లారిన తర్వాత విచారణ చేపడుతాని తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో సుమారు రూ 50 కోట్ల వరకు ఆస్థి నష్టం వాటిల్లినట్లు ప్రాదమిక అంచనగా పేర్కొంటున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ధారూరు, నవంబరు 30, ప్రభాతవార్త:** ధారూర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి తనవంతు కృషి చేస్తానని అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ధారూర్ మండల కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో ధారూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతు ప్రభుత్వం వచ్చిందని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా వికారాబాద్ జిల్లాకు సాగునీరు అందిస్తా మన్నారు. గత ప్రభుత్వంలో ప్రాణహిత చేవెళ్ల, రంగారెడ్డి ఎత్తిపోతల పథకా లను నిర్మాణం చేయ కుండా వికారాబాద్ జిల్లాకు సాగునీరు రాకుం డా చేశారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం సృష్టించిందని 7 లక్షల కోట్ల అప్పు చేసి జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం నెలకొందన్నారు. ఫార్మా విలేజ్ ఏర్పాటుపై ప్రతిపక్షాలు నాగాయాగీ చేయడం రాజకీయం తప్ప ప్రజల మేలు కోసం కాదన్నారు. రైతుల కోరిక మేరకే లగచర్ల ప్రాంతంలో ఏర్పాటు చేయాలనుకున్న ఫార్మా విలేజ్ నిర్ణయాన్ని ఉపసహరించారన్నారు. ధాన్యం కొనుగోలు కోసం 10,547 వేల కోట్లు కేటాయించామన్నారు. అర్హులైన మిగతా రైతులకు డిసెంబర్ 9 నాటికి రుణమాఫీ అవుతుందని, దిగులు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్‌సింగ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొత్తపల్లి విజయభాస్కర్ రెడ్డి, ఏఐసిసి యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాలే వృత్తి.. శుభకార్యాలే టార్గెట్

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

## దొంగల నుండి 38 తులాల బంగారం స్వాధీనం

**ఇబ్రహీంపట్నం, నవంబరు 30, ప్రభాతవార్త :** దొంగతనాలు వృత్తిగా ఎంచుకొని..శుభకార్యాలు టార్గెట్‌చేసి బంగారు ఆభరణాల దొంగతనాలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి వివరాలు వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి లో గల ట్రాంక్విల్ రిసార్ట్స్ లో వివాహం జరుగుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 14వ తేదీన జరిగిన చోరీ కేసును పోలీసులు చాకచక్యంగా చేదించారు. నిందితుల నుండి 38 తులాల బంగారు ఆభరణాలు, ఒక సెల్ ఫోన్, రూ.40 వేల నగదు, ఒక ఇగ్నస్ కారును స్వాధీనం చేసుకున్నట్లు డిసిపి చెప్పారు. చోరీ సొత్తు మొత్తం నిందితుల నుంచి రకవరీ చేసిన



వివరాలు వెల్లడిస్తున్న డిసిపి సునీతారెడ్డి, ఇతర అధికారులు

పోలీసులను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం, పిప్ల్యరసోడా, రాజ్ఘడ్ జిల్లా, గుల్కేడి గ్రామానికి చెందిన అరుడ (38) , అదే గ్రామానికి చెందిన రిషి (19), అభిషేక్ (25)తో పాటు ఓ మైనర్ ముఠాగా ఏర్పడి దొంగతనాలే వృత్తిగా మలుచుకొని శుభకార్యలు జరుగుతున్న ఫంక్షన్ హాల్లను టార్గెట్ చేసి పక్కా వ్యూహంతో దోపిడీలు చేయడం అలవాటు చేసుకున్నారు. ఎవరికి అనుమానం రాకుండా ముందుగా మైనర్ ను పంపి మిగతావారు దూరంగా ఉండి గమనిస్తూ దోపిడి చేస్తున్నారు. వీరిలో ఒక మైనర్ (12), అరుడా (38)లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. కర్ణాటక రాష్ట్రాం తిరుపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో రెండు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. అక్కడ దొంగతనం చేసి తిరిగి హైదరాబాద్ సాగర్ రోడ్డు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రమిదా గార్డెన్స్ సమీపంలో అనుమానాస్పదంగా కారు ఉండటంతో కారును తనిఖీ చేయగా నిందితులు పట్టుపడినట్లు చెప్పారు. ఈ తరుణంలో ఇద్దరు పట్టుపడగా మిగితా ఇద్దరు పరారయినట్లు వివరించారు.కాగా స్వాదీనం చేసుకున్న సోత్తులో 20తులాల బంగారు ఆభరణాలు కర్ణాటక రాష్ట్రం తిరుపూర్‌కు పోలీస్ స్టేషన్‌కు చెందినవిగా గుర్తించి అక్కడి స్థానిక పోలీసులకు అప్పచెప్పారు.

# నోటిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యానికి భద్రత



విద్యార్థులకు టూత్‌బ్రెష్‌లు ఉచితంగా పంపిణీ చేసిన దృశ్యం

## నెల రోజులపాటు విద్యార్థులకు ఎంఎన్ఆర్ దంత కళాశాల వైద్యపరీక్షలు, సూచనలు

**సంగారెడ్డి, నవంబరు 30, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాలోని ఎం.ఎన్.ఆర్ డెంటల్ కళాశాల వైద్య బృందం నెల రోజులపాటు చిన్నారి విద్యార్థులకు నోటి శుభ్రతకు సంబంధించి అవగాహన కలిగించారు. నోటి శుభ్రతే సంపూర్ణారోగ్యానికి భద్రత అని చైతన్యవంతుల్ని చేసారు. కళాశాల దంత వైద్యవిభాగం నిర్వాహకులు ప్రిన్సిపల్ శ్రీధర్ సారథ్యంలో వారి బృందం సామాజిక, విద్యార్థులను చైతన్యవంతుల్ని చేసారు.

ఈ సందర్భంగా శనివారం ముగింపు కార్యక్రమాలను స్కూల్‌లో నిర్వహించారు. ప్రిన్సిపల్ పి.నాగజ్యోతి సారథ్యంలో 'నోటి శుభ్రతే సంపూర్ణ ఆరోగ్యానికి భద్రత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా లలిత కుమారి హాజరై విద్యార్థులకు బాలల వేధింపుల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ, మహిళా విద్యాభివృద్ధితోనే అనే అంశాలపై చక్కగా వివరించారు. ఎన్ఎంఆర్ డెంటల్ కళాలశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ నోటి ఆరోగ్యం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. సంగారెడ్డిలోని ఏడు పాఠశాలల్లో దంత పరీక్షలు నిర్వహించామన్నారు. నెల రోజుల్లో3142 మంది విద్యార్థులకు దంత పరీక్షలు,దంత పరిజ్ఞానాన్ని మెరుగు పరచటానికి క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పేస్టులు,బ్రష్‌లు ఉచితంగా పంపిణి చేసినట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ బిడ్డల దంత రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిల్లలు దంతక్షయం బారిన పడకుండా వారి దంతాలకు ఫ్లోరైడ్ ప్రయోగ కార్యక్రమాలను నిర్వహించామని వివరించారు. పాలపళ్ళకు సంబంధించి కూడా తల్లిదండ్రులకు అవగాహన సదుస్సులు నిర్వహించామన్నారు. అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి ముఖ్యఅతిథిగా లావణ్య హాజరు కాగా బహుమతులు అందించినట్లు తెలిపారు.

శనివారం ముగింపు సందర్భంగా ఓ పండగ వాతావరణంలా నిర్వ హించారు. ఈ వేడుకల సందర్భంగా నుక్కడ్ నాటక్ మరియు క్విజ్ పోటీలు నిర్వహించగా సీనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నసీమున్ షేక్, డాక్టర్ స్రవంతి,డాక్టర్ స్నేహిక,దంత వైద్యకళాశాల విద్యార్థులు హౌస్ సర్జన్లు పాల్గొన్నారు.

# గుండెపోటుతో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్ మృతి

## ఎమ్మెల్యే కూనంనేని దిగ్భ్రాంతి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 30, ప్రభాతవార్త:** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ గుండెపోటుతో మృతిచెందారు. శనివారం సాయంత్రం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని స్వగ్రామం యాప్రాల్‌కు చెందిన ఎన్.బాలమల్లేశ్‌కు గుండెపోటు రావటంతో వెంటనే ఎఎస్‌రావునగర్‌లోని హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఎన్.బాలమల్లేశ్ మృతిచెందినట్లు పార్టీ వర్గాల వారు పేర్కొన్నారు.



ఎన్.బాలమల్లేశ్ (ఫైల్)

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ హఠాన్మరణం చెందినట్లు సమాచారం అందుకున్న రాష్ట్ర సిపిఐ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని కల్గించిందని అన్నారు. సిపిఐలో అంచెలంచలుగా ఎదిగిన ఎన్.బాలమల్లేశ్ రాష్ట్ర సిపిఐ సహాయ కార్యదర్శిగా రాణించటం ఆయన హఠాన్మరణం అందరిని కలతకు గురిచేసిందన్నారు. పార్టీలో ఎఐఎస్ఎఫ్ నాయకునిగా, ఆ తరువాత వివిధ పదవులను చేపట్టి పార్టీకి జీవితం అంకితం చేశారన్నారు. ఆయన మేనమామ ఏఆర్ దేవరాజ్ పార్టీలో రాష్ట్ర నాయకునిగా పనిచేశారని, జిల్లాలో పార్టీ సంక్షోభంలో ఉన్న దాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎన్.బాలమల్లేశ్ పనిచేసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహించి పార్టీలో, పేదల్లో మంచి గుర్తింపును పొందారని అన్నారు. బాలమల్లేశ్ మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని, ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ఎమ్మెల్యే,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలియజేశారు. సిపిఐ శ్రేణులు బాలమల్లేశ్ మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో విద్యార్థులు ఆందోళన

**హైదరాబాద్ (గోషామహల్), నవంబరు 30, ప్రభాతవార్త:** కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాన్ని యూజిసిలో చేర్చాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ శనివారం కళాశాల ప్రధాన ద్వారం వద్ద పెద్ద ఎత్తున్న ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటి అనుబంధంగా ఉన్న కోఠి మహిళా కళాశాల తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ మహిళా యూనివర్సిటీగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యా లయంగా పేరు మార్చారన్నారు. కాని తమ ఐడి కార్డులో తెలంగాణ మహిళా యూనివర్సిటీగా కార్డు ఇస్తున్నారని, తమ సర్టిఫికెట్లలో కూడా గందర గోళంగా ఉందని తెలిపారు.ఇలా చేయడం వల్ల తాము ఎంతో మనోవేధన గురవుతు న్నామన్నారు. తమ డీగ్రి పూర్తి అవుతున్న నేపథ్యంలో ఇంత వరకు యూజిసిలో చేర్చక పోవడం వల్ల తమ ఏ ప్రతిపాదికన సర్టిపికెట్ ఇస్తారని మండిపడ్డారు. తమ భవిష్యత్తు అయోమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రానున్న అసెంబ్లీ శీతకాల సమావేశాల్లో యూజిసిలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న విసి సూర్య ధనుంజ్ అక్కడికి చేరు కుని విద్యార్థులను సము దాయించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

# ప్రజాపాలన విజయోత్సవం కోఆర్డినేటర్ల జాబితా విడుదల

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తున్న సందర్భంగా అటు ప్రభుత్వం, ఇటు కాంగ్రెస్‌పార్టీ విజయోత్సవాలకు సిద్ధమైంది. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కమార్‌గౌడ్ ఆదేశాలమేరకు నియోజకవర్గ ఎమ్మెల్యేలను డిసిసిలలతో చర్చించి కోఆర్డినేటర్లను నియమించారు. ఎక్కడైతే ఎమ్మె ల్యేలు లేరో అక్క నియోజకవర్గ ఇంచార్జీలను సంప్రదించి కోఆర్డినేటర్లను నియమించారు. నియోజక వర్గాలస్థాయిలో కోఆర్డినేటర్లను నియమించి ఇటు పార్టీని ప్రభుత్వ యంత్రాంగంను సమన్వయం చేసుకుంటూ కార్యకర్తల ఆత్మస్థైరం పెంపొందించే విధంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 119 నియోజకవర్గాలకు 119 మందిని కోఆర్డినేటనర్లను నియమిస్తూ టిపిసిసి సీనియర్ వైస్ ప్రసిడెంట్ టి కుమార్‌రావు శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు.



పదవీవిరమణ చేసిన మధ్యప్రదేశ్ డిజిపి సుధీర్ సక్సేనా, పక్కన ఆయన కుమార్తె సోనాక్షి సక్సేనా.

## డిజిపిగా పదవీవిరమణ చేసిన తండ్రి

### డిసిపి హోదాలో కుమార్తె వీడ్కోలు పెరేడ్

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** దేశ పోలీసు చరిత్రలో ఓ అరుదైన సన్నివేశం శనివారం ఆవిష్కృతమయ్యింది. మధ్యప్రదేశ్ డిజిపిగా వున్న సుధీర్ సక్సేనా శనివారం నాడు పదవీ విరమణ చేశారు. 1987 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన సక్సేనా పోలీసు శాఖలో 37 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు కొనసాగించారు. కాగా ఆయన పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో శనివారం ఉదయం ఘనంగా జరిగింది. కాగా ఈ వీడ్కోలు పరేడ్‌కు సక్సేనా కుమార్తె 2020 బ్యాచ్ ఐపిఎస్ అధికారిణి సోనాక్షి సక్సేనా నేతృత్వం వహించారు. తండ్రి పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమానికి కుమార్తె పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన సందర్భం దేశంలో ఇదే తొలిసారిగా చెబుతున్నారు. సోనాక్షి సక్సేనా భోపాల్ సిటీ క్రైం డిసిపిగా పనిచేస్తున్నారు.

## త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్

### కబ్జాదారుల్లో ధనవంతులు, రాజకీయ నాయకులే

### అధికం : హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** త్వరలో హైడ్రా పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటూ సమస్త జీవకోటికి ప్రాణాధారమైన నీటి వనరులను పరిరక్షించి జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ అన్నారు. ఈమేరకు శనివారం జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్మెంటల్ ఇనిషియేటివ్ ఆధ్వర్యంలో అర్బన్ బయోడైవర్సిటీ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు రంగనాథ్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. చెరువులు పరిరక్షణ, వాటి పునరుద్ధరణ, ప్రజావసరాలకోసం కేటాయించిన స్థలాలు, పార్కులు, రహదారులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ కాకుండా చూడడం హైడ్రా ప్రధాన విధి అన్నారు. దీనికి దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలను పరిరక్షించడంతో పాటు ఆస్తి నష్టం కాకుండా చూస్తామన్నారు. హైడ్రా యాక్షన్‌లోకి వచ్చాక చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల అంశాన్ని అందరూ చర్చించు కుంటున్నారని తాము కొంటున్న ఇల్లు, స్థలం చెరువులో ఉందా.. ప్రభుత్వ స్థలమా అన్ని విధాల సరైనదేనా అనే విషయాలను ప్రజలు తెలుసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, కబ్జా చేయడంలో పేదవారి కంటే ధనవంతులు, సంపన్నులు, రాజకీయ పార్టీల వ్యక్తులు కనిపిస్తున్నారని ఆక్రమణలకు పాల్పడితే ఏ ఒక్కరినీ వదలమని హెచ్చరించారు.

## పోలీసు, పారా మిలటరీ లాన్‌టెన్నిస్ పోటీలో

## ఐజి చంద్రశేఖర్‌రెడ్డి జోడికి స్వర్ణ పతకం



బంగారు పతకం అందుకున్న తెలంగాణ మల్టీ జోన్ 1 ఐజి పి చంద్రశేఖర్‌రెడ్డి జోడి.

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా పోలీసు, పారా మిలటరీ బలగాల అధికారులు పాల్గొన్న లాన్ టెన్నిస్ పోటీల్లో తెలంగాణ మల్టీ జోన్ 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి జోడికి స్వర్ణ పతకం దక్కింది. బెంగళూరులోని కెఎస్ఎల్‌జిఎ స్టేడియంలో నవంబర్ 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 50 ప్లస్ వయో కేటగిరి విభాగంలో తెలంగాణ నుంచి మల్టీ జోన్ 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, నారాయణ్‌పేట్ సాయుధ బలగం అదనపు ఎస్పీ మహమ్మద్ రియాజ్‌లజోడి ఫైనల్‌లో ఎపికి చెందిన డిఎస్ పిలు రాంకుమార్, సత్యనారాయణల జోడిని 9.6పాయింట్లతో ఓడించింది.

## తీర్పులను ఉల్లంఘించి నియామకాలు చేపట్టడం చెల్లదు

### మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల నియామకంపై హైకోర్టు తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు30:** మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ నోటిఫికేషన్(2002)కు సంబంధించి అర్హతల వివాదంపై సుప్రీంకోర్టు,హైకోర్టు తీర్పులను ఉల్లంఘించి దొడ్డిదారిన ప్రభుత్వ జీవో జారీ చేసి నియామకాలు చేపట్టడం చెల్లదని తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించింది. అర్హతలు,కోర్టు తీర్పులతో స్థిరపడ్డాక వాటికి విరుద్ధంగా ప్రభుత్వం జీవో ద్వారా నియామకాలు చేపట్టడం తగదని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వుల్లో తొలగించిన 1200 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 1207 చట్ట విరుద్ధమని... కోర్టు తీర్పుల స్ఫూర్తికి వ్యతిరేకమని పేర్కొంది. అలా తిరిగి తీసుకోవడం వల్ల మరిన్ని వివాదాలు తలెత్తుతాయని తెలిపింది. జీవోను సమర్థిసేనత ప్రభుత్వం చేసిన తప్పునే కోర్టు మళ్లీ చేసినట్లవుతుందని వ్యాఖ్యానించింది.

## అమెరికాలో దుండగుడి కాల్పుల్లో

## ఖమ్మం విద్యార్థి మృతి



శ్రీసాయితేజ (ఫైల్)

**క్రైమ్ ఖమ్మం నవంబరు 30, ప్రభాతవార్త:** సొంత గడ్డను విడిచి పెట్టాడు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు దూరంగా వెళ్లిపోయాడు. తన సొంత కాళ్లపై జీవించాలని లక్ష్యంతో తన లక్ష్యమే ధ్యేయంగా ఎంచుకున్నాడు. చివరకు దుండగులు జరిపిన కాల్పుల్లో ఓ విద్యార్థి మృతి చెందాడు. అమెరికాలో గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ఖమ్మంలోని ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నపేట గ్రామానికి చెందిన నూకరపు కోటేశ్వరావు, వాణి దంపతులకు చెందిన ఏకైక కుమారుడు శ్రీసాయితేజ అమెరికా దుండగులు కాల్పుల్లో మరణించాడు. పొట్ట చేత పట్టుకొని కుటుంబ సభ్యులకు దూరంగా వెళ్లి జీవితంలో స్థిరపడాలనుకున్న సాయి తేజను అమెరికాలోని చికాగో ప్రాంతంలో దుండగులు పొట్టన పెట్టుకున్నారు. కోటేశ్వరరావు దంపతులకు ఏకైక కుమారుడు సాయి తేజ ఉన్నత చదువులు కోసం అమెరికా పంపించారు. సాయి తేజతో పాటు కుమార్తె సైతం అమెరికాలో అక్కడ స్థిరపడ్డారు. నాలుగు నెలల క్రితం అమెరికా వెళ్ళిన సాయి తేజ అక్కడ సూపర్ మార్కెట్లో పార్ట్ టైం ఉద్యోగిగా విధుల్లో చేరాడు. ఎంఎస్ చదవడానికి వెళ్ళిన సాయి తేజను ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న తరుణంలో దుండగులు డబ్బు డిమాండ్ చేయడంతో తన వద్ద లేవని నిరాకరించిన తరుణంలో అక్కడికక్కడే కాల్పులు జరపడంతో మృత్యువాత పడ్డాడు.అమెరికాలోని చికాగోలో మృతి చెందిన సాయి తేజ మృతదేహాన్ని ఖమ్మం తీసుకురావడానికి డిసెంబర్ 6వ తేదీ వరకు సమయం పడుతుందని తెలుస్తుంది.

# అంగన్‌వాడి కేంద్రాలకు నిరాటంకంగా పాల సరఫరా

### 100 శాతం టార్గెట్‌ను చేరుకోవాలి

### పాల సరఫరాను విజయడెయిరీ మెరుగు పరుచుకోవాలి

### పోషకాహార తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

### ఆరోగ్యలక్ష్మి పథకంపై మంత్రి సీతక్క సమీక్ష



**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాలకు చేసే పాల సరఫరాలో ఎటువంటి గ్యాప్స్ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు జారీచేసారు. మారుమూల ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సకాలంలో పాల సరఫరా జరగాల్సిందేనని స్పష్టం చేసారు. పోషకాహార తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యలక్ష్మి పథకంపై మంత్రి సీతక్క శనివారం నాడు సచివాలయంలో తనచాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు జరుగుతున్న పాల సరఫరాపై మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సీతక్క సమీక్షించారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు 200ఎంఎల్ పాలను గర్భిణీలు, బాలింతలకు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ విజయ డెయిరీ టెట్రా ప్యాకెట్ల అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తుంది. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 1.67 కోట్ల లీటర్ల సరఫరా కోసం ఆర్డర్ చేయగా 1.56 కోటి లీటర్ల పాలను విజయా డెయిరీ సరఫరా చేయగలిగింది. అంటే 94 శాతం మేర సరఫరా చేయగలిగింది. అయితే కొన్ని అంగన్ వాడీ సెంటర్లకు సకాలంలో పాలు సరఫరా కాకపోవడం పట్ల మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడి కేంద్రాలకు ప్రభుత్వం కోరినంత మేర పాలు సరఫరా చేయగలరా? లేదా? అంత సామర్థ్యం ఉందా? లేదా? సరిపోయినంత సరఫరా చేసే శక్తి లేకపోతే మీ ఇండెంట్‌ను తగ్గించి ఇతర సంస్థల ద్వారా సరఫరా చేసుకోవాలా అని విజయ డెయిరీ ప్రతినిధులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. మరో మూడు నెలల పాటు అవకాశం ఇస్తామని పాల సరఫరా సంతృప్తికరంగా లేకపోతే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ విజయ డెయిరీ రైతుల నుంచి పాలను సేకరిస్తుందని అందుకే రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు విజయడెయిరీ నుంచి పాలను కొనుగోలు చేస్తున్నామని గుర్తు చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు తమకు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంరక్షణ అంతే ముఖ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేసారు. అందుకే అంగన్ వాడీ కేంద్రాలకు జరిగే పాల సరఫరాలో ఏలాంటి గ్యాప్స్ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ఆరోగ్య తెలంగాణ, పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే పాల నాణ్యతను స్వయంగా రుచి చూసి మంత్రి సీతక్క పరిశీలించారు. మూడు నెలల పాటు ఏలాంటి గ్యాప్స్ లేకుండా పాలను సరఫరా చేసిన తర్వాత మరోసారి సమీక్షించి ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసారు మంత్రి సీతక్క తెలిపారు. కాగా మంత్రి సీతక్క చేసిన కృషి ఫలించింది. ములుగు నియోజకవర్గంలో నూతనంగా 30 పడకల ఆసుపత్రి, మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడంలో 30 పడకల ఆసుపత్రిలకు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

# పదోన్నతులకు అడ్డంకిగా ఇక ఎక్స్‌టెన్షన్‌లు వద్దు

### ఇంజినీర్ల పదోన్నతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ

### ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ల హర్షం



**హైదరాబాద్, నవంబరు 30,ప్రభాతవార్త:** పదోన్నతులకు అడ్డంకిగా ఎక్స్‌టెన్షన్ పేరుతో రెగ్యులర్ పోస్టులో పదవి విరమణ పొందినవారిని కూర్చోబెట్టడం ఇక వద్దు అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఇరిగేషన్ ఇంజనీర్లతో ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌బి, నీటిపారుదల, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల్లో ఎక్స్‌టెన్షన్ విధానం అమలు పరచడంతో కిందిస్థాయి ఉద్యోగుల్లో నిరాశ నిస్పృహలు పెరిపోయివారిలో ఉద్యోగతప్తి కూడా కనుమరుగవుతోందని అభిప్రాయపడ్డారు. ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌ల నుంచి ఎవరిని ఉంచాలి, ఎవరిని తొలగించాలనే ఆ వివరాలు సెకండ్ లెవల్‌లో తెప్పించుకుంటున్నామని సిఎం అన్నారు. తొందరలోనే వాళ్ళ నియమకాల వల్ల ప్రమోషన్లు ఏవైతే ఆగిపోయావో ఆ వరుసక్రమంలో పరిష్కరిస్తూ వస్తామని సిఎం హామి ఇచ్చారు. రిటైర్డువాళ్ళను తీసుకోవడం మంచిదే కావొచ్చు కానీ వారిని ఓఎస్‌డి కిందనో లేకపోతే సాంకేతిక సహాయం కోసం వాళ్ళ అనుభవం ఆయా శాఖలు వాడుకోవడంలో తప్పులేదుకానీ రెగ్యులర్ పోస్టులో కూర్చోబెట్టడం అవసరంలేదు.

**ఓఅండ్ఎం ఇఎన్‌సి నాగేందర్ ఎక్స్‌టెన్షన్ రద్దు**

ఓఅండ్ఎం ఇఎన్‌సి నాగేందర్ ఎక్స్‌టెన్షన్ రద్దు చేయడంతోపాటు ఇక ఇంజనీరింగ్‌శాఖలో పదోన్నతులకు అడ్డుగా రిటైర్డు ఉద్యోగులను రెగ్యులర్ పోస్టులో కొనసాగించమని ముఖ్యమంత్రి హామి ఇవ్వడంతో హైదరాబాద్ ఇంజనీర్లసంగం, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సంఘం, ఇరిగేషన్ డిప్లొలమా ఇంజనీర్లసంఘం హర్షం వ్యక్తంచేసింది. హైదరాబాద్ ఇంజనీర్లసంఘం అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి ప్రధానకార్యదర్శి చక్రాదర్, తెలంగాణ ఇరిగేషన గ్రాడ్యుయేషన్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఎన్ శ్రీధర్,ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణలు మాట్లాడుతూ మన తెలంగాణ రాష్ట్రంలో గానీ మొట్టమొదటి సారిగా నీటిపారుదలశాఖలో ఎక్స్‌టెన్షన్ లో ఒక్క ఉద్యోగి లేకుండా చేసే ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కిందని అన్నారు. ఒఅండ్ఎం ఇఎన్‌సి బి.నాగేందర్‌రావుకు మళ్ళీ రెండో సారి ఎక్స్‌టన్షన్ ఇవ్వకపోవడంతోపదోన్నతి గొలుసుకట్టు కదులు తుందని వారు హర్షం వ్యక్తంచేశారు.

## నాపై ఆరోపణలకు ఆధారాలుంటే సిబిఐ విచారణకు ఇవ్వండి

### మంత్రి పదవిలో ఉండే అర్హత కొండా సురేఖకు లేదు: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 30:** గురుకులాల కార్యదర్శిగా తాను పని చేసిన సమయంలో అవినీతి జరిగి ఉంటే ప్రభుత్వం విచారణ చేసి తనను జైలుకు పంపవచ్చని బీఆర్ఎస్ నేత, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ గురుకుల బాట పడతామంటే, సమస్యలు పరిష్కరించాల్సింది పోయి మతిస్తిమితం లేని నేతలు తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ స్థాయికి తాను దిగజారలేనని, వారికి మంత్రి పదవిలో ఉండే అర్హత లేదని ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. వరంగల్‌లో కొండా కుటుంబం చేసిన అఘాయిత్యాలతో ఎన్నో కుటుంబాలు నాశనం అయ్యాయని ఆరోపించారు. నేర చరిత్ర పెట్టుకొని కొండా సురేఖ తమపై అభాండాలు వేస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మంత్రి సీతక్క మూలాలు మరచి మాట్లాడుతున్నారని ప్రవీణ్ కుమార్ ఆక్షేపించారు. తాను అవినీతి చేసినట్లు ఆధారాలు ఉంటే సీబీఐ విచారణ చేయించండని సవాల్ విసిరారు. గురుకులాలపై తాము కాదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేశారని ఆరోపించారు. కుట్ర ఎవరు చేస్తున్నారో బయటపెట్టాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. హైకోర్టు మొట్టి కాయలు వేసినా మారడం లేదన్న ప్రవీణ్ కుమార్, చేతకాకపోతే విద్యాశాఖను బీఆర్ఎస్‌కు అప్పగించాలని అన్నారు. కాంగ్రెస్‌కు రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత లేదని ఆయన వ్యాఖ్యానించారు.

## రైతు పండుగ పేరుతో మళ్లీ మోసం

### సిఎంపై హరీశ్‌రావు ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 30:** రైతు పండుగ పేరుతో రేవంత్‌రెడ్డి రైతులను మాయమాటలతో మరోసారి మోసం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు పం డుగ సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యల పట్ల హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ రైతు పండుగలో రేవంత్‌రెడ్డి సహా మంత్రులు ఎంత మొత్తుకున్నా దండుగే అయ్యింది. ఏడాది పూర్తయిన సందర్భంగా నైనా రైతులందరికీ రుణమాఫీ, వానాకాలంతో పాటు ఈ యాసంగికి ఇచ్చే రైతు భరోసా మొత్తం కలుపుకొని ఎకరాకు రూ.15 వేలు ప్రకటిస్తారనుకుంటే మరోసారి మొండి చెయ్యి చూపారు.

# నీటిపారుదలశాఖలో భారీ అవినీతి తిమింగలం

### సస్పెండెడ్ ఎఇఇ నికేష్‌కుమార్ అక్రమాస్తులపై ఎసిబి దాడులు

### రూ. 17.73 కోట్ల ఆస్తుల గుర్తింపు

### బహిరంగ మార్కెట్లో రూ. 200 కోట్లపైమాటే



ఎఇఇ నికేష్ కుమార్

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** నీటిపారుదల శాఖలోని అవినీతి తిమింగలం నిఖేష్ కుమార్,ఆయన బంధువులకు చెందిన ఇళ్ళపై ఎసిబి అధికారులు శనివారం ఏకకాలంలో దాడులు చేసి సోదా చేశారు. నీటి పారుదల శాఖలో పనిచేస్తూ ఎసిబికి పట్టుబడి సస్పెండ్ అయిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హెరూర్ నికేష్ కు మార్ అక్రమాస్తులను చూసు అవినీతి నిరోధకశాఖ అధికారులే అవాక్కైనారు. ఈ సందర్భంగా 17.73 కోట్ల రూపాయల అక్రమాస్తులను ఎసిబి గుర్తించగా వీటి విలువ బహిరంగ మార్కెట్లో 200 కోట్ల రూపాయలకు పైమాటేనని అధికారులు చెబుతున్నారు. నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధుల్లో చేరిన నికేష్ కుమార్ వరంగల్ జోన్‌లో ఎక్కువ కాలం పనిచేశారు. ఆ తరువాత పదోన్నతిపై అసిస్టంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హోదాలో హైదరాబాద్‌కు బదిలీ అయి చెరువుల పరిరక్షణ, ఆక్రమణల నివారణ బాధ్యతలను చూసేవారు. నగరంలోని ఎర్రమంజిల్‌లో గల నీటి పారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన పనిచేసేవారు. ఆయన అక్కడ పనిచేసే సమయంలోనే చెరువులు, కుంటలను ఆక్రమించిన రియల్టర్ల నుంచి లక్షలాది రూపాయలు లంచాలు తీసుకున్నట్లు అభియోగాలు వచ్చాయి. ముఖ్యంగా బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ లెవల్‌లను ఆక్రమించిన రియల్టర్లకు నికేష్ కుమార్ కొమ్ముకాసినట్లు అభియోగాలున్నాయి. వీటిపై ఎసిబి ఆరా తీస్తున్న సమయంలో గత మే నెల 30 వ తేదీన ఒక వ్యక్తి నుంచి భవన నిర్మాణానికి ఎన్‌ఓసి ఇచ్చేందుకు లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఆయనను ఎసిబి అధికారులు అరెస్టు చేసి జైలుకు తరలించగా ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. అప్పటి నుంచి ఆయన సస్పెన్షన్‌లోనే వున్నారు. ఇదే సమయంలో ఎసిబి అధికారులు నికేష్ కుమార్ అక్రమాస్తులపై వివరాలు సేకరించి వీటిని బేరీజు వేశాక శనివారం ఉదయం దాడులకు దిగింది. హైద రాబాద్‌తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలలో 19 చోట్ల ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లోని నికేష్ కుమార్ ఇంటితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు జరిగాయి. దాడుల సందర్భంగా ఇళ్లకు సంబంధించిన ఐదు ప్లాట్లు, ఆరున్నర ఎకరాల వ్యవసాయ పొలం, మ రో ఆరు ఖాళీ ప్లాట్లు రెండు వాణిజ్య ప్లాట్లను ఎసిబి అధికారులు గుర్తించారు. వీటి విలువ 17 కోట్ల 73 లక్షల 53 వేల 500 రూపాయలుగా తేలింది. అయితే బహిరంగ మార్కెట్లో వీటి విలువ 200 కోట్ల రూపాయల వరకు వుండవచ్చని అధికారులు భావిస్తున్నారు. రాజపుష్పలో 56 ఆస్తులు, కొల్లూరులో 15ఎకరాల అగ్రికల్చరల్ ల్యాండ్ మోయినాబాద్‌లో మూడుఫామ్‌హౌజ్‌లు, మూడు ఖరీదైన విల్లాలు, ఎస్‌బిఐ బ్యాంకు నుంచి కోట్ల రూపాయల నగదు లావాదేవిలు, వివిధబ్యాంకుల్లో ఆర్టీజిఎస్‌లు చేసినట్లు ఎసిబి అధికారులు గుర్తించారని తెలిసింది. అనేక మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సంబంధాలు కలిగి ఉండటంతోపాటు ఆదిభట్లలో 26 ఆస్తులు ఉన్నట్లు ఎసిబి జప్తుచేసిన డాక్యూమెంట్లలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోన్నది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో నికేష్ కుమార్ ను ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో బఫర్‌జోన్‌లలో లంచాలు తీసుకొని అనేక అక్రమ అనుమతులు జారీచేసిన కేసులో నికేష్ కుమార్‌ను అరెస్టు చేయనున్నట్లు సమాచారం. ఎసిబి చరిత్రలోనే అతి భారీ అవినీతి అధికారిని గుర్తించినట్లు ఎసిబి అధికారవర్గాలు చర్చించుకుంటున్నాయి.

### ఐపిఎల్‌లో రూ.1.10 కోట్లు పలికిన వండర్‌బాయ్ వైభవ్ సూర్యవంశీ

# ఆసియా కప్ మ్యాచ్‌లో ఒక్క పరుగుకే ఔట్!

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది మార్చి నెల నుంచి జరగనున్న ఐపిఎల్ సీజన్ కోసం రాజస్తాన్ రాయల్ కోటి పది లక్షల రూపాయల ధర వెచ్చించి కొనుగోలు చేసిన బిహార్‌కు చెందిన వండర్ బాయ్ వైభవ్ సూర్యవంశీ దుబాయ్‌లో జరుగుతున్న అండర్ 19 ఆసియా కప్‌లో పాక్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఒ క్క పరుగుకే అవుట్ అయ్యాడు. 13 ఏళ్ల వయస్సులోనే రంజీ మ్యాచ్ ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించిన సూర్యవంశీ వయస్సు గురించి అనుమానాలు, ఆరోపణలు వచ్చినా దీనిపై ఐపిఎల్ నిర్వాహకులు పెద్దగా పట్టించుకో లేదు. అతడిని రాజస్తాన్ రాయల్స్ జట్టు కోటి 10 లక్షల రూపాయకు కొనుగోలు చేసింది. ఇతను ఐపిఎల్‌లో ఆ జట్టు తరపున తుది జట్టులో వుంటాడా...? లేదా...? అన్నది నిర్ధారణ కాకపోయినా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ కన్నా తక్కువ వయస్సులోనే రంజీ మ్యాచ్ లు ఆడిన ఆటగాడికా రికార్డుకెక్కాడు. రంజీలో ఓ మోస్తరు ప్రదర్శనే చేసినా ఇతని బ్యాటింగ్ శైలి బాగుందని క్రికెట్ నిపుణులు చెబుతుండడంతో ఇతనిపై అంచనాలు పెరిగాయి. ఈ క్రమంలోనే వైభవ్ సూర్యవంశీ భారత అండర్ 19 జట్టులో స్థానం సంపాదించాడు. ప్రస్తుతం భారత అండర్ 19 దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటోంది. శనివారం నాడు జరిగిన తొలిమ్యాచ్‌లో పాకిస్తాన్ చేతిలో భారత్ 47 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో భారీ అంచ నాల మధ్య ఓపెనర్‌గా వచ్చిన సూర్యవంశీ ఒక్క పరుగు మాత్రమే చేసి వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసిన రాజస్తాన్ రాయల్స్ నిర్వాహకులు నిరాశ చెందారు.



## టి కన్సల్ట్ సదస్సులో 117 ఒప్పందాలు

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త:** ఆవిష్కర్తలతో పెట్టుబడుదారులను కలిపే సహకార సదస్సు-2024లో 117 ఒప్పందాలు కుదరడం అభినందనీయమని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రశంచారు. టి కన్సల్ట్ అనే సంస్థ గచ్చిబౌలిలోని టి హబ్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల సదస్సును మంత్రి శనివారం ప్రారంభించారు. ఆవిష్కర్తలతో పెట్టుబడిదారులతో కలిపే ఈ కార్యక్రమం అభివృద్ధికి నూతన మార్గాలను అన్వేషిండంలో సహాయ పడుతుందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు అన్నారు. పాలసీ మేకర్స్, ఆవిష్కర్తలు, పరిశ్రమ నేతలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సదస్సు ఏర్పాటులో తీవ్రంగా శ్రమించిన టి కన్సల్ట్ సంస్థ వ్యవస్థాపకుడు సందీప్ మక్తాలను ఆయన అభినందించారు. కొత్త ఒప్పందాల వల్ల రాష్ట్రం ఆవిష్కరణల్లో, పారిశ్రామిక ప్రగతిలో ముందు వెళ్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. సదస్సులో అన్ ట్యాప్డ్ ఇన్ వెస్టర్ ప్రోగ్రాం, టి కన్సల్ట్ హెల్త్, డాక్టర్స్ పూల్, టేలెంట్ కనెక్ట్, ఎంఎస్ ఎంఇ పాలసీపై చర్చల వల్ల నూతన ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులతో సంప్రదింపులు జరిపే అవకాశం ఏర్పడిందని చెప్పారు. ఐటి రంగంలో పనిచేస్తున్న ప్రతిభావంతులకు 63 దేశాల్లోని సంస్థలతో అనుసంధానం చేయడం గొప్ప కార్యక్రమమని మంత్రి ప్రశంసించారు. ఉద్యోగులను కంపెనీలతో కలపడం, ఐటి ఉద్యోగులను ఇతర దేశాల్లో అదే రంగంలో ఉన్న ఉద్యోగులతో కనెక్ట్ చేయడం ఈ సదస్సు వల్ల సాధ్యమైందని శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించడం టి కనెక్ట్ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ పూజారి అరెస్ట్



**ఢాకా, నవంబరు 30:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలపై జరుగుతున్న దాడుల క్రమంలో అక్కడి మహ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం మరో హిందూ పూజారిని అరెస్టుచేసింది. పూజారి శ్యామ్‌దాస్‌ప్రభును ఆదేశ పోలీసులుఛటోగ్రామ్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆధ్యాత్మిక నేతచిన్మయ్ కృష్ణదాస్‌ను అరెస్టుచేసిన కొద్దిరోజులకే ఈ సంఘటన జరిగింది. జైలులో ఉన్న చిన్మయ్‌కృష్ణదాస్‌ను కలిసేందుకు ప్రభుదాస్ వెళ్లినట్లు తెలిసింది. ఈసందర్భంగా ఎలాంటి వారంట్‌లేకుండానే ఆయనను అరెస్టుచేసినట్లు ఇస్కాన్‌ప్రతినిధి కోల్‌కత్తా వైస్‌ప్రెసిడెంట్ రాధారామన్‌దాస్ తెలిపారు. మరోబ్రహ్మచారి శ్రీశ్యామ్‌దాస్‌ప్రభును ఈరోజు ఛటోగ్రామ్‌పోలీసులు అరెస్టుచేసారని సోషల్‌మీడియా ఖాతా ఎక్స్‌లో ఆయన ప్రకటించారు. కాగా కృష్ణదాస్‌ను దేశద్రోహం కేసుకింద పోలీసులు గత సోమవారం అరెస్టుచేసారు. ఆయన అరెస్టుకు వ్యతిరేకంగా బంగ్లా రాజధాని ఢాకా,ఛటోగ్రామ్‌తో సహా పలుప్రాంతాల్లోనిరసనలు మారుమోగాయి. దాస్‌ను విడుదలచేయాలని డిమాండ్‌లుపెరిగాయి. కాగా దాస్‌బెయిల్‌ను ఛటోగ్రామ్‌కోర్టు తిరస్కరించింది. ఈక్రమంలోపోలీసులు నిరసకరారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో ఎపిపి సైఫుల్ ఇస్లాం మరణించాడు. ఈ లాయర్ హత్యకు సంబంధించి బంగ్లాపోలీసులు తొమ్మిది మందిని అరెస్టుచేసారు. 46 మందిపై కేసు నమోదు చేసారు.

## జిఓ 317 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 30:** తెలంగాణ ప్రభుత్వం జీవో 317కు సంబంధించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్గదర్శకాలను జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు అనుగుణంగా సీఎస్ శాంతికుమారి మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన జీవో ఎంఎస్ నెం. 243, 244, 245 జారీ చేశారు. మెడికల్, స్పౌస్, మ్యూచువల్ ఆధారంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వీటికి సంబంధించిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు కేటగిరీలకు సంబంధించి విడివిడిగా మార్గదర్శకాలను జారీ చేశారు. ఖాళీలకు లోబడి స్థానిక కేడర్‌లో మార్పు, బదలీకి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో ఆయా స్థానాల్లో ఉన్న ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రభుత్వం అందులో పేర్కొంది.

## సచివాలయ ఉద్యోగుల సంఘం పేరు మార్పు

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం పేరును డాక్టరు బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ సంఘంగా మార్చుతూ సంఘం కార్యవర్గం తీర్మానించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీంతో పాటు, సచివాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సచివాలయ సంఘంలో పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని, 2024 డిసెంబరులోగా ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేశారు.

## డిసెంబరు నెల 14న జాతీయ లోక్‌అదాలత్

**హైదరాబాద్ (చార్మినార్), నవంబరు 30, ప్రభాతవార్త :** జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబరు నెల 14వ తేదీన నిర్వహించనున్నామని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి,జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ చైర్ పర్సన్ రేణుక యార అన్నారు. సిటీ సివిల్ కోర్టులోని తన ఛాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి,జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ చైర్ పర్సన్ రేణుక యార మాట్లాడుతూ డిసెంబర్ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి కక్షిదారుడు తప్పకుండ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.విలేకర్ల సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా ఐపిఎల్ మెగా వేలం



ఇస్సీ వాంగ్



పూనమ్ యాదవ్



లియా తహూ



క్యాథరిన్ బైర్స్

## ఆటగాళ్ల వేటలో ఐదు ఫ్రాంచైజీలు

### భారీగా రూ.4.45 కోట్ల బడ్జెట్‌లో గుజరాత్ జెయింట్స్

**న్యూఢిల్లీ:** మహిళల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపీఎల్)–2025 సీజన్ ఫిబ్రవరి మరియు మార్చిలో జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన మెగా వేలంకోసం సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మెగా వేలం డిసెంబరు నెలలో జరగనుంది. దీనికి సంబంధించి మొత్తం ఐదు ఫ్రాంచైజీలకు చెందిన జట్లు కొత్త సీజన్ కోసం రిటైన్ చేయబడిన, విడుదల చేసిన ఆటగాళ్ల జాబితాను ప్రకటించాయి. స్నేహరానా, క్యాథరిన్ బైర్స్, పూనా యాదవ్, ఇస్సీ వాంగ్ మరియు లియా తహూ వంటి పెద్ద పేర్లు అంటిపెట్టుకోడానికి అవకాశం ఉంది. మొత్తం 5 జట్లు తమ విడుదలైన ఆటగాళ్ల జాబితాను వెల్లడించాయి. ఇక 2025 వేలంలో గుజరాత్ జెయింట్స్ భారీ బడ్జెట్‌ను కలిగి ఉంది. మహిళల ప్రీమియర్ లీగ్ యొక్క మూడవ వేలం కోసం వేదిక సిద్ధమవుతోంది. అన్ని జట్లు 2025 సీజన్‌కు ముందు తమతమ రిటైన్ మరియు రిలేస్డ్ ప్లేయర్‌ల జాబితాను ఖరారు చేశాయి. చాలా జట్లు తమ కోర్ని నిలుపుకోవాలని ఎంచుకున్నప్పటికీ, గుజరాత్ జెయింట్స్ (బిగి) బ్యాక్‌టుబ్యాక్ సీజన్‌లలో చివరి స్థానంలో నిలిచిన తర్వాత కొన్ని పెద్దకాల్‌లను తీసుకుంది. గుజరాత్‌కు చెందిన ఫ్రాంచైజీ ప్రీమియర్ ఇండియన్ ఆల్‌రౌండర్ స్నేహ రానాను విడుదల చేసింది, ఆమె బెత్ మూనీ గైర్హాజరీలో 2023 సీజన్‌లో ఎక్కువ భాగం వారికి కెప్టెన్‌గా కొనసాగింది. అదే సమయంలో వారు మహిళల గి20 ప్రపంచ కప్ 2024 విజేత లీ తహుహుతో పాటు, స్కాట్లాండ్ స్టార్ క్యాథరిన్ బైర్స్‌ను కూడా వదులుకున్నారు. ఇక ముంబై ఇండియన్స్ 2023లో తమ టైటిల్ విన్నింగ్ క్యాంపెయిన్‌లో కీలక భాగమైన ఇస్సీ వాంగ్‌ను తిరిగి విడుదల చేసింది, మరియు టోర్నమెంట్ చరిత్రలో హ్యాట్రిక్ సాధించిన మొదటి ప్లేయర్‌గా ఉంది. అలాగే భారత వెటరన్ స్పిన్నర్ పూనమ్ యాదవ్‌ను కూడా ఢిల్లీ క్యాపిటల్స్ (డిసి) విడుదల చేసింది.

ఇక వేలానికి సంబంధించి ఫ్రాంచైజీల పర్స్ స్లాట్లు కూడా ధృవీకరించడం జరిగింది. ఇందులో భాగంగా గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ పర్సులో రూ.4.40 కోట్లు, 4 స్లాట్లు, వారియర్జ్ పర్సులో రూ.3.90 కోట్లు 3 స్లాట్లు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పర్సులో రూ.3.25 కోట్లు, 4 స్లాట్లు, ముంబై ఇండియన్స్ పర్సులో రూ.2.65 కోట్లు, 4 స్లాట్లు, ఢిల్లీ రాజధాని ఫ్రాంచైజీ పర్సులో రూ.2.50 కోట్లు, 4 స్లాట్లు ఉన్నాయి. ఇక మహిళల ప్రీమియర్ లీగ్ వేలం 2024 మరియు 2025లో విదేశాలకు వెళ్లినప్పటికీ, చివరి రెండు వేలంలు దేశంలోనే జరిగాయి.



## ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్‌లో
# ఫైనల్స్‌కు సింధు

**న్యూఢిల్లీ:** గత రెండేండ్లుగా బీడబ్ల్యూఎఫ్ టైటిల్ వేటలో ఉన్న పివి సింధు ఆ కొరతను తీర్చుకునే దిశగా కీలక ముందడుగు వేసింది. లక్నోలో జరుగుతున్న సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె ఫైనల్స్‌లోకి అడుగుపెట్టింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్లో సింధు 21–12, 21–9తో భారత్‌కే చెందిన 17ఏళ్ల ఉన్నతి హుడాపై విజయం సాధించింది. సింధు దూకుడుగా ఆడటంతో ఈ మ్యాచ్ కేవలం 36 నిముషాల్లోనే ముగిసింది. అలాగే భారత్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ తనీషా క్రాస్టో, ధ్రువ్ కపిల కూడా ఫైనల్‌కు చేరుకున్నారు. ఐదో సీడ్ అయిన భారత్ ద్వయం 21–16, 21–15తో నాలుగో సీడ్ అయిన చైనాకు చెందిన హాంగ్ జౌ, జియా యి యాంగ్‌పై వరుస గేమ్‌లో విజయం సాధించింది. ఈ మ్యాచ్ 42 నిముషాలు పాటు సాగింది. అంతకు ముందు జరిగిన ప్రిక్వార్టర్స్‌లో 18వ ర్యాంకర్ సింధు కష్టమ్మీద నెగ్గింది. ఈ క్వార్టర్స్‌లో 21–15, 21–17తో డై వాంగ్ (చైనా)పై గెలిచింది. 8 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో సింధు. అంతగా అనుభవం లేని చైనా అమ్మాయిపై అలవోక విజయం సాధించింది. సెమీస్‌లో ఆమె భారత్‌కే చెందిన ఉన్నతి హుడాతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్స్‌లో ఉన్నతి 21–16, 21–9తో ఇషికా జైస్వాల్ (యూఎస్‌ఏ)ను ఓడించి సింధుతో పోరుకు సిద్ధమైంది. ఇక పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21–8, 21–19తో మీరబ లువాంగ్(భారత్)ను ఓడించి సెమీస్‌లోకి ప్రవేశించాడు. మిక్స్‌డ్‌డబుల్స్‌లో ధ్రువ్ కపిల తనీషా క్రాస్టో జోడీ, మహిళల డబుల్స్‌లో రెండో సీడ్ త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ ద్వయంసైతం సెమీస్‌కు అర్హత సాధించాయి.

## ముస్తాక్ అలీ ట్రోఫీలో..
# హైదరాబాద్ రెండో విజయం



**న్యూఢిల్లీ:** ఆ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో హైదరాబాద్ మళ్లీ గెలుపు బాట పట్టింది. రాజ్‌కోట్‌లో బీహార్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బీహార్ 20 ఓవర్లలో 118/9 పరుగులకే పరిమితమైంది హైదరాబాద్ బౌలర్ టేకుల పల్లి రవితేజ (4/24) రాణించాడు. అనంతరం లక్ష్యాన్ని హైదరాబాద్ 12.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదనను పూర్తి చేసింది. రోహిత్ (56 నాటౌట్), కెప్టెన్ తిలక్ వర్మ (51 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. స్మాట్‌లో ఆడిన 4 మ్యాచ్‌లలో హైదరాబాద్‌కు ఇది రెండో విజయం.



## వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో
# గుకేశ్ గేమ్ డ్రా

**న్యూఢిల్లీ:** భారత్ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌కు ప్రతీ రౌండ్ లోనూ గట్టి పోటీనే ఇస్తున్నాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ సమరంలో నాలుగో రౌండ్ గేమ్ డ్రా గా ముగిసింది. 32ఏళ్ల లిరెన్‌పై ఎత్తులకు ధీటైన సమాధానం ఇవ్వడంతో చివరకు 42 ఎత్తుల తర్వాత ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. తొలి గేమ్‌లో ఓడిన గుకేశ్ రెండో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. తిరిగి మూడో రౌండ్లో సత్తా చాటుకున్న 18 ఏళ్ల ఈ భారత్ క్రీడాకారుడు చైనా గ్రాండ్ మాస్టర్‌ను ఓడించాడు. తాజాగా నాలుగోరౌండ్ గేమ్ డ్రాగా ముగియడంతో ఇద్దరూ 2–2పాయింట్లతో సమ ఉజ్జీలుగా నిలిచారు. ఇంకా 10 గేములు మిగిలి ఉన్న ఈ ఛాంపియన్‌షిప్‌లో ముందుగా ఎవరైతే 7.5 పాయింట్లు సాధిస్తారో వారే విజేతగా నిలుస్తారు.

# దక్షిణాఫ్రికా భారీ స్కోరు
## పరాజయానికి చేరువైన శ్రీలంక




**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మొదటి టెస్టులో శ్రీలంక పరాజయానికి చేరువైంది.. 516 పరుగులు భారీ విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన శ్రీలంక మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్లకు 103 పరుగులే చేసింది. కరుణ రత్నే 4 పరుగులు, నిసాంక 23 పరుగులు, మాథ్యూస్ 25 పరుగులు, కమిందు 10 పరుగులు, ప్రభాత్ 1 పరుగు చేసి పెవిలియన్ చేరారు.

దినేశ్ చండీమల్ 29 పరుగులుతో బ్యాటింగ్‌లోను, ధనంజయ్ డిసిల్వ బ్యాటింగ్‌తో క్రీజులో ఉన్నారు. శ్రీలంక గెలుపు కోసం మరో 413 పరుగులు చేయాల్సి ఉంది. రబడ 2 వికెట్లు, మార్కో యాన్సెన్ 2 వికెట్లు పడగొట్టారు.. అంతకు ముందుక ఓవర్ నైట్ స్కోరు 3 వికెట్ల నష్టానికి 132 పరుగులతో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు నష్టానికి 366 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ 221 బంతుల్లో 122 పరుగులు, 9 ఫోర్లు, 2 సిక్స్‌లు, కెప్టెన్ తంబా బవుమా 228 బంతుల్లో 113 పరుగులు,99 ఫోర్లు కొట్టి సెంచరీలు నమోదు చేయడం విశేషం. స్టబ్స్ కెరీర్‌లో ఇది రెండో శతకం కాగా, బవుమాకు మూడోది. వీరిద్దరూ 4వ వికెట్‌కు 249 పరుగులు జోడించారు.

# వాణిజ్యం

# భారత్‌లో ఇటాలియన్ పెట్టుబడుల వెల్లువ

**న్యూఢిల్లీ, నవంబరు 30:** ఈ యూరోపియన్ దేశం (ఇటలీ) ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పెట్టుబడిగా ఇటాలియన్ కంపెనీలు భారతదేశంలో యుఎస్ 6.5 బిలియన్ల పెట్టుబడులు పెట్టాయని ది యూరోపియన్ హౌస్ అంబ్రోసెట్టి గ్రూప్ సీనియర్ భాగస్వామి లోరెంజో తవాజ్జీ తెలిపారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థకు ఇచ్చిన ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది. అలాగే ఇక్కడ అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన ఉద్ఘాటించారు. ముంబైలో విలేజియో ఇటాలియా ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం తవాజీ మాట్లాడారు. టెక్నాలజీ విషయంలో ఇటలీ, భారత్ మధ్య బంధం మరింతగా పెరుగుతుందన్నారు. రెండు దేశాల వంటకాలు సుగంధ ద్రవ్యాల వాడకంపై దృష్టి సారిస్తాయని ఆయన అన్నారు. ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఫోకస్డ్ కంపెనీ దశాబ్ద కాలంగా భారతదేశంలోని భారతీయ విద్యార్థులకు శిక్షణ ఇస్తోందని, ఇటాలియన్ కంపెనీలు ఉద్యోగాలు కల్పిస్తున్నాయని చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలకు విద్యా సంబంధాలు చాలా ముఖ్యమని ముంబయికి చెందిన మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ఎస్‌డిఎ బొకోని ఆసియా సెంటర్‌కు చెందిన అలెశాండ్రో గిలియాని అన్నారు. టెక్నికల్ స్కిల్స్‌లో భారతదేశం అగ్రగామిగా ఉందని, అయితే సాఫ్ట్ స్కిల్స్‌లో మరింత నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ చర్చలో ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎడిటర్‌ఇన్‌చీఫ్ విజయ్ జోషి మాట్లాడుతూ, భారత దేశం, ఇటలీ మధ్య చాలా ప్రాముఖ్యతలు ఉన్నాయని, రెండు దేశాల ప్రజలు ఒకరిగురించి ఒకరు తెలుసుకోవాలని అన్నారు. తాను ఇటలీకి పెద్ద అభిమానినని, మరే ఇతర యూరోపియన్ నగరాల కంటే రోమ్‌ను ఎక్కువసార్లు సందర్శించానని జోషి చెప్పారు. భారతపౌరులు ఇటలీగురించి మరింత తెలుసుకోవాలని, ఇటాలియన్ ప్రజలు భారతదేశం గురించి మరింత తెలుసుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. భారతదేశంలో ప్రాముఖ్యత ఇస్తున్నట్లే ఇటలీలోని ప్రజలు కుటుంబ సంబంధాలకు చాలా ప్రాముఖ్యతనిస్తారని అన్నారు.



# నేటి నుంచి కొత్త నిబంధనలు




**న్యూఢిల్లీ, నవంబరు 30:** సాధారణంగా కొత్త నెల ప్రారంభం అవుతుందంటే కొన్ని నిర్ణయాలు అమలులోకి వస్తుంటాయి. కొన్ని అంశాలకు సంబంధించిన నిర్ణయాలను కొత్త నెల ప్రారంభం రోజునే తీసుకుంటారు. అలా ఈ డిసెంబర్, 2024లోనూ పలు ఆర్థిక అంశాలకు సంబంధించిన కీలకమార్పులు చోటు చేసుకోనున్నాయి. ఎల్‌పీజీ గ్యాస్ ధరల నుంచి క్రెడిట్ కార్డుల వరకు పలు అంశాలు ఇందులో ఉన్నాయి. సాధారణంగా ప్రతి నెల 1వతేదీన ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను ప్రభుత్వం సమీక్షిస్తుంది. కొన్నిసార్లు ధరలను పెంచడం, తగ్గించడంతో పాటు స్థిరంగా కొనసాగిస్తుంది. గత కొద్ది నెలలుగా గృహ వినియోగ గ్యాస్ ధరలు స్థిరంగా కొనసాగు తుండగా గత రెండు నెలల నుంచి 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తుంది. ఈ డిసెంబర్ నెలలోనూ గ్యాస్ ధరలు పెరిగే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అదే జరిగితే వినియోగదారులపై అదనపు భారం పడనుంది. డిజిటల్ గేమింగ్ ప్లాట్ ఫారం లేదా వ్యాపారం కోసం ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఉపయోగిస్తున్నట్లయితే మీకో అలర్ట్. ఎస్‌బీఐ కార్డ్ వెబ్‌సైట్ ప్రకారం డిసెంబర్ 1, 2024 నుంచి కొత్త రూల్స్ తెస్తోంది. ఇకపై ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులు డిజిటల్ గేమింగ్ ప్లాట్ ఫామ్స్ లేదా వ్యాపార లావాదేవీలపై ఎలాంటి రివార్డ్ పాయింట్లు రావు.

దేశీయ టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ డిసెంబర్ 1 నుంచి కొత్తరూల్స్ తీసుకొస్తోంది. ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ వంటివి నిరోధించేందుకు ఓటీపీతో సహా వాణిజ్య సందేశాలను గుర్తించేందుకు కొత్త ట్రేసబిలిటీ నిబంధనలు తీసుకొస్తోంది. ఇకపై ఏపీకే ఫైల్స్, మోసపూరిత మెసేజ్‌లు రాకుండా టెలికాం సంస్థలు వాటిని నిరోధిస్తాయి. అయితే, ఈ కొత్త రూల్స్ ద్వారా బ్యాంకింగ్ వంటి ముఖ్యమైన ట్రాన్సాక్షన్ల ఓటీపీలు ఆలస్యమవుతాయనే ఆందోళన నెలకొంది. కానీ, అలాంటిదేమీ ఉండదని ట్రాయ్ స్పష్టం చేసింది. ఆధార్ కార్డులో వివరాలను ఉచితంగా అప్డేట్ చేసుకునేందుకు గడువు డిసెంబర్ 14తో ముగుస్తుంది. ఆలోపు ఆధార్ కార్డులో పేరు, అడ్రస్, చిరునామా వంటి వివరలను ఫ్రీగా చేసుకోవచ్చు. ఆ తర్వాత అయితే ఒక్కో ట్రాన్సాక్షన్‌కి 50 రూపాయలు ఆపైన చెల్లించాల్సి వస్తుంది.


# అధిక ధరలు వసూలు చేస్తే జరిమానాయే!

**ముంబై, నవంబరు 30:** కొందరు దుకాణదారులు సామగ్రిని అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తారు. అలాంటి సమయంలో వారు చెప్పిన ధరకే వాటిని కొనుగోలు చేయాలా, డబ్బులు నష్టపోకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ప్రతి వస్తువుకు గరిష్ట రిటైల్ ధర (ఎంఆర్ పీ) నిర్ణయిస్తారు. ఈ ధరను ఆ వస్తువు లేబుల్ పై అందరికీ కనిపించేలా ముద్రిస్తారు. ఆ ధరకు మించి కొనుగోలుదారులు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే కొందరు దుకాణాదారులు ఎంఆర్ పీ కంటే ఎక్కువ ధరను వసూలు చేస్తారు. అదేమిటని ప్రశ్నిస్తే నిరక్ష్యంగా సమాధానం చెబుతారు. అలాగే చిల్లర ఇవ్వడానికి బదులు చాకెట్లు, మిఠాయిలను చేతిలో పెడతారు. చాలామంది వినియోగదారులు ఇలాంటి మోసాల బారిన పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఎక్కువ ధరకు సరుకులను కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు చేసింది. వాటిని సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులను కూడా నియమించింది. వీటిపై ప్రజలు అవగాహన పెంచుకుంటే మోసాల నుంచి బయటపడవచ్చు. ఆర్థికంగా నష్టపోకుండా ఉండే అవకాశం కలుగుతుంది. దుకాణ యజమాని ఒక వస్తువును ఎంఆర్ పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్టానికి ఫిర్యాదు చేయవచ్చు. వడోదరకు చెందిన న్యాయవాది విరాజ్ ఠక్కర్ ఇటీవల ఈ విషయంపై మాట్లాడారు. దుకాణదారులు ఎంఆర్ పీ కంటే ఎక్కువ వసూలు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టంచేశారు. దుకాణదారులు ఇలా ఎక్కువ ధరకు వస్తువులను విక్రయించినా, వస్తువు బరువు తక్కువగా ఉన్నా వెంటనే ఫిర్యాదు చేయవచ్చు. అయితే రెస్టారెంట్లు, కేఫ్ లలో మాత్రం బిల్లుకు అదనంగా సర్వీస్‌చార్జీని వసూలు చేస్తారు. కొన్ని నిబంధనల ప్రకారంవారికి అనుమతి ఉంటుంది. అవి తప్ప బయట మార్కెట్ లో అదనపు చార్జీలు వసూలు చేయడం చట్టవిరుద్ధం. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం.. వ్యాపారులు వస్తువుల ఎంఆర్పీ కంటే అధిక వసూలు చేయడం నేరం. అది చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది.




# వర్చువల్ బంగారంతో ఎన్నో లాభాలు

**ముంబై, నవంబరు 30:** సాధారణంగా బంగారాన్ని ఆభరణాలు, నాణేల రూపంలో అందరూ కొనుగోలు చేస్తారు. వీటిని పలు సందర్భాల్లో భౌతికంగా వినియోగించుకోవడానికి వీలుంటుంది. అయితే బంగారంపై పెట్టుబడి పెట్టాలనుకునే వారికి వర్చువల్ గోల్ బాగుంటుంది. ఈ విధానంలో మీ చేతిలో బంగారం ఉండదు. గోల్డ్ ఈటీఎఫ్‌లు, సావరిన్ గోల్డ్ బ్యాండ్లు (ఎస్ జీబీలు), డిజిటల్ గోల్డ్ తదితర రూపాలలో దాచుకోవచ్చు. మీ పెట్టుబడి వాటిలో నిల్వ చేయబడుతుంది. మార్కెట్‌లో బంగారం ధరలకు అనుగుణంగానే వీటి ధరలు పెరుగుతూ ఉంటాయి. సాధారణంగా బంగారు ఆభరణాలు కొనాలంటే తక్కువలో తక్కువ సుమారు రూ.20 వేలు ఖర్చుపెట్టాలి. కానీ వర్చువల్ గోల్డ్‌ను రూ.వందతో కూడా కొనుగోలు చేయవచ్చు. ఆ రోజు బంగారానికి ఉన్న ధర ప్రకారం, మీ పేరు మీద జమ చేస్తారు. మీ వద్ద ఉన్న డబ్బులను దానిలో పెట్టుబడి పెట్టుకుంటూ పోతే క్రమంగా పెద్ద మొత్తంలో బంగారం పెరుగుతుంది. వర్చువల్ విధానంలో బంగారం కొనడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. తక్కువ మొత్తంలో పెట్టుబడిని పెట్టవచ్చు. భౌతికంగా బంగారం కొంటే తరుగు, మజూరి తదితరఛార్జీలు ఉంటాయి. వర్చువల్ విదానంలో ఈ అదనపు ఖర్చులు ఉండవు. ఇంటిలోనే కూర్చుని మీ వద్ద ఉన్న బంగారాన్ని అమ్ముకోవచ్చు లేదా కొనుగోలుచేయవచ్చు. బంగారు ఆభరణాల దుకాణాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. వర్చువల్ విధానంలో మీ పేరు మీద బంగారం ఉంటుంది గానీ మీ ఇంటిలోఉండదు. కాబట్టి దొంగల భయం అస్సలు ఉండదు. ఎంత బంగారం కొనుగోలు చేసినా నిశ్చింతంగా నిద్రపోవచ్చు. దాని భద్రత, దాచుకోవడంపై భయపడాల్సిన అవసరం లేదు. బంగారు ఆభరణాలను కొనుగోలు చేసినప్పుడు దాని డిజైన్ ఆధారంగా మేకింగ్ చార్జీలు వసూలు చేస్తారు.



# వచ్చే యేడాదిపైనే ఆడి ఇండియా ఆశలు

**న్యూఢిల్లీ, నవంబరు 30:** వచ్చే యేడాది అమ్మకాలు తిరిగి పుంజుకుంటాయని ఆశిస్తున్నట్లు లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా. సరఫరా అంతరాయాలతో ప్రస్తుత సంవత్సరంలో కంపెనీ పనితీరుకు ఆటంకం కలిగింది. 2024 మొదటి రెండు త్రైమాసికాల్లో సరఫరా సవాళ్ల నుండి కోలుకుని వచ్చే సంవత్సరంలో అమ్మకాలు 810 శాతం పెరుగుతాయని ఆడి అందనున్నాయి. భారత్ 2024లో లగ్జరీ కార్ల పరిశ్రమ వృద్ధి 810 శాతం శ్రేణిలో ఉంటుందని అంచనా వేస్తున్నాం. కంపెనీ కూడా ఇదే విధమైన వృద్ధిని ఆశిస్తోంది అని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ కలిగి ఉంది. గత మూడేళ్లలో భారీ వృద్ధిని కనబరిచిన తర్వాత పరిశ్రమ విక్రయాల వృద్ధి క్షీణించిందని చెప్పారు. ఈ సంవత్సరం జనవరి–సెప్టెంబర్‌లో పరిశ్రమవృద్ధి దాదాపు 5శాతంగా ఉంది. గత మూడేళ్లలో 30శాతం వార్షిక వృద్ధిని సాధించింది. లగ్జరీకార్ల పరిశ్రమ ఈ సంవత్సరం ఎన్నడూలేనంత అత్యధిక వార్షిక విక్రయాలు 50,000 యూనిట్ల మార్కును దాటుతుందని విశ్వసిస్తున్నామని బల్బీర్ సింగ్ ధిల్లాన్ అన్నారు. మొదటి రెండు త్రైమాసికాల్లో కార్ల సరఫరా తగినంతగా లేనందున 2024ఆడి ఇండియాకు కఠిన సంవత్సరంగా మారిందని పేర్కొన్నారు. కాబట్టి ఈ ఏడాది ఎడగలేమని, వచ్చే సంవత్సరం బలంగా తిరిగి పుంజుకుంటా మని వివరించారు. కాగా, ఈయూవీక్యూ7 కొత్తవెర్షన్‌ను సంస్థ పరిచయం చేసింది. కంపెనీ ఇప్పటివరకు భారత్ 10,000 యూనిట్లకు పైగా క్యూ7 మోడల్ కార్లను విక్రయించింది.



# ఇండియన్ బ్యాంకు స్పెషల్ డిపాజిట్ గడువు పెంపు

**న్యూఢిల్లీ, నవంబరు 30:** ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన ఇండియన్‌బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఈ బ్యాంకుల్లో ఉన్న స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేసేందుకు ప్రస్తుతం డెడ్‌లైన్ నవంబర్ 30 వరకే ఉండేది. వీటిల్లో పెట్టుబడులపై ఇతర సాధారణ డిపాజిట్ల కంటే అధికంగా రిటర్న్స్ వస్తాయి. అంటే సాధారణ డిపాజిట్ల కంటే స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌లో వడ్డీ రేట్లు కాస్త ఎక్కువే ఉంటాయి. ఇంకా ఇక్కడ కూడా సాధారణ ప్రజల కంటే సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ వస్తుంది. ఈ క్రమంలోనే బ్యాంక్ ఒక కీలక ప్రకటన చేసింది. వీటిల్లో డిపాజిట్లు చేసేందుకు గడువు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఇండియన్ బ్యాంకులో ఇండ్ సుప్రీం ప్రొడక్ట్ 300 రోజుల వ్యవధితో, ఇండ్ సూపర్ ప్రొడక్ట్ 400 రోజులతో ప్రత్యేక డిపా జిట్లు ఉన్నాయి. వీటిల్లో ఇప్పుడు పెట్టుబడి పెట్టేందుకు గడువును దాదాపు మరో 4నెలలు పొడిగించి 2025, మార్చి 31 వరకు చేసింది. అంటే.. అప్పటి వరకు ఈప్రత్యేక పథకాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు అవకాశం ఉంటుందన్న మాట. ఇండ్ సూపర్ 400 డేస్ ఈ బ్యాంకుల్లో అత్యధిక వడ్డీ అందించే స్పెషల్ డిపాజిట్ స్కీమ్ ఇదే. ఇక్కడ కనీసం రూ.10 వేల నుంచి గరిష్టంగా రూ.3 కోట్ల వరకు డిపాజిట్లు చేయొచ్చు. ఈ డిపాజిట్ కాల వ్యవధి 400 రోజులుగా ఉంది. సాధారణ ప్రజలకు ఇక్కడ 7.30 శాతం వడ్డీ వస్తుంది. సీనియర్ సిటిజెన్లకు 7.80 శాతం, సూపర్ సీనియర్ సిటిజెన్లకు 8.05 శాతంగా వడ్డీ రేట్లు ఉన్నాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.